Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 296 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 14 నవంబర్ 2023 | మంగళవారం | పేజీలు : 4

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

### శ్రీవారి దర్శనానికి ఎన్ని గంటల సమయం పడుతోందంటే..

తిరుపతి : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. నేడు (మంగళవారం) శ్రీవారి దర్శనం కోసం 22 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామి వారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఇక నిన్న (సోమవారం) 80,551 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 4.27 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.



# కార్తీకం మొదలైంది

# ఇక దంచుడే...!!

## ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్న పార్టీలు

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఇప్పటికే కోలాహలంగా సాగుతోంది. అధికార పార్టీ బీఆర్ ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, బీజేపీలు ప్రచారాన్ని దంచికొడుతున్నాయి. నాయకుల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. విమర్శల పర్వాలు కొనసాగుతున్నాయి. ఫైర్ బ్రాండ్ నాయకుల నుంచి అగ్ర నేతల దాకా ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే.. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే!. ఎందుకంటే.. నామినేషన్ల ఘట్టం వరకు అభ్యర్థులు(అన్ని పార్టీల్లోనూ) ప్రచారంపై పెద్దగా దృష్టి పెట్టలే దు. ఆస్తులు, అప్పులు, అఫిడవిట్లు, నేతల బుజ్జగింపులు, రెబల్స్‌తో రాజీలు.. నామినేషన్ల ఉప సంహరణ వంటి అనేక అంశాలపై దృష్టి పెట్టారు. అయినప్పటికీ.. ప్రచారం మాత్రం నిన్న మొన్నటి వరకు జోరుగానే సాగింది.

కానీ, ఇప్పుడు నామినేషన్ల ఘట్టానికి సంబంధించిన తంతు పూర్తయింది. దీంతో నేతలు కొంత రిలీఫ్ అయ్యారు. ఫలితంగా ప్రచారంపైనే ఎక్కువగా దృష్టి పెట్టనున్నారు. అదేసమయంలో దీపావళి అమావాస్య సెంటి మెంటు కూడా సోమవారంతో ముగిసిపోయింది. అమావాస్య తర్వాత నుంచి ప్రచారానికి ఖచ్చితంగా 17 రోజుల గడువు ఉంటుంది. ఈ 16 రోజులను కూడా పూర్తిగా సద్వినియోగం చేసుకుని ప్రచారాన్ని దంచి కొట్టాలని నేతలు, పార్టీలు కూడా నిర్ణయించాయి. కాంగ్రెస్ అగ్రనేతలు, రాహుల్, ప్రియాంకలతోపాటు.. చివరి మూడు రోజులు సోనియాగాంధీ కూడా ప్రచారంలో పాల్గొననున్నారు. ఇక, బీఆర్ ఎస్ తరఫున సీఎం కేసీఆర్ ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే కొన్నినియోజకవర్గాల్లో ప్రచారం కూడా చేశారు.

అయితే.. మరోసారి ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాలని నిర్ణయించారు. ఇక, బీజేపీ అగ్రనేతలు.. మోడీ, అమిత్ షాలతోపాటు జేపీ నడ్డా కేంద్ర మంత్రులు ఇక్కడ పర్యటనకు రెడీ అయ్యారు. మోడీ షెడ్యూల్ ప్రకారం.. మరో నాలుగు సార్లు.. వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేసి ఎన్నికల ప్రచారంలో ఊపు తేనున్నారని తెలుస్తోంది.

మొత్తంగా .. నిన్నటి వరకు ఒక లెక్క. రేపటి నుంచి మరో లెక్క అనే తరహాలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరి వాడి.. వేడెక్కనుందని అంటున్నారు పరిశీలకులు.

# బీఆర్ఎస్ టార్గెట్టంతా కులాలేనా ?



హైదరాబాద్ : తెలంగాణాలో ఎన్నికల తేది దగ్గరపడేకొద్దీ అధికార బీఆర్ఎస్ కులసంఘాలపైన ఎక్కువగా దృష్టిపెట్టినట్లు అర్ధమవుతోంది. ప్రతి నియోజకవర్గంలోను అభ్యర్ధులు, ఇన్చార్జిలు, సీనియర్ నేతలు ఎక్కువగా వివిధ సామాజికవర్గాల్లోని నేతలను బుజ్జగించటంపైనే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారు. అభ్యర్ధులు, నేతలు ప్రచారానికి వెళ్ళినపుడు చాలా చోట్ల జనాలు ఎదురుతిరుగుతున్నారు. సంక్షేమపథకాలు అర్హులకు అందలేదని కొన్ని గ్రామాల్లోను, అభివృద్ధి జరగలేదని మరికొన్ని గ్రామాల్లోను జనాలు నిలదీస్తున్నారు. భూకబ్జాలు పెరిగిపోయాయని, అవినీతి ఆకాశానికి చేరుకుందని కూడా జనాలు నిలదీస్తున్నారు. జనాలు నిలదీస్తుండటంతో అభ్యర్ధులు, నేతల్లో టెన్షన్ పెరిగిపోతోంది. అందుకనే ఒకవైపు నిలదీతలను ఎదుర్కొంటునే మరోవైపు చాపకింద నీరులాగ కులసంఘాల పెద్దలతో మీటింగులు పెట్టుకుంటున్నారు. ఆత్మీయ సమావేశాల పేరుతో కులసంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీల్లోని వర్గాలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నది. వివిధ వర్గాలను బీఆర్ఎస్ అభ్యర్ధుల గెలుపుకు సహకరించేట్లుగా ఏకతాటిపైకి తీసుకొచ్చే బాధ్యతలను కేసీయార్ కొందరు మంత్రులకు అప్పగించినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ సమావేశాలు ఏ స్ధాయిలో జరుగుతన్నాయంటే కేసీయార్ పోటీచేస్తున్న గజ్వేలు, కామారెడ్డిలో కూడా జరుగుతున్నాయి. అంటేనే ఓట్లు పడే విషయంలో బీఆర్ఎస్ అభ్యర్ధులు, నేతల్లో ఏ స్ధాయిలో టెన్షన్ పెరిగిపోతోందో అర్ధమవుతోంది. ఆత్మీయ సమ్మేళనాల్లో హామీలిచ్చేటపుడు ప్రభుత్వం ఇప్పటివరకు కులాలకు చేసిన మేళ్ళని సంఘాల్లోని పెద్దలతో చెప్పిస్తున్నారు. పనిలోపనిగా సదరు పెద్దలకు ప్రత్యేకంగా ప్యాకేజీలు కూడా ఆఫర్ చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇప్పటివరకు ఎస్సీల్లో మాదిగ, గిరిజన, ముస్లిం మైనారిటిల్లోని సామాజికవర్గాలతో మీటింగులు పెట్టినట్లు సమాచారం. ఇదే సమయంలో న్యాయవాదులు, ఉద్యమకారులు, కళాకారులు, మేధావులు, విద్యార్ధి సమ్మేళనాలకు కూడా శ్రీకారం చుడుతున్నది. అంటే గెలుపుకు అందుబాటులో ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని కూడా బీఆర్ఎస్ వదులుకోవాలని అనుకోవటంలేదు. మేడ్చల్ జిల్లాలోని శామీర్ పేటలో గిరిజన ఆత్మీయ సమేళనాన్ని బీఆర్ఎస్ నిర్వహించబోతున్నది. మంత్రులు కేటీయార్, హరీష్ రావు, సత్యవతీ రాథోడ్ హాజరవుతున్నారు. తండాలను గ్రామపంచాయితీలుగా మార్చటం, పోడు భూములకు గిరిజనులకే పట్టాలు ఇవ్వటం, గిరిజన పండుగులను రాష్ట్ర పండుగలుగా గుర్తించటం లాంటి అంశాలను వివరించబోతున్నారు. మరి చివరకు ఏమవుతుందో చూడాలి.




హైదరాబాద్: నాంపల్లిలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. బజార్‌ఘాట్‌లోని ఓ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగి నాలుగు అంతస్తులకు మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో దట్టమైన పొగ తీవ్రతతో ఊపిరాడక 9 మంది మృతిచెందారు. మృతుల్లో నాలుగు రోజుల పసికందుతో పాటు ఇద్దరు మహిళలు ఉన్నారు. ఘటనాస్థలికి నాలుగు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో గ్యారేజ్ ఉండటంతో కారు రిపేర్ చేస్తుండగా మంటలు వచ్చాయి. అదే సమయంలో అక్కడ డీజిల్, కెమికల్ డ్రమ్ములు ఉండటం.. వాటికి మంటలు అంటుకోవడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. దీంతో పక్కనే అపార్ట్‌మెంట్లలో ఉంటున్నవారు భయాందోళనకు గురయ్యారు. గ్యారేజ్‌లో ఉన్న మిగతా కెమికల్ డబ్బాలను అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. ప్రమాదంతో గ్యారేజ్‌లో ఉన్న పలు వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఘటనాస్థలంలో జీహెచ్ఎంసీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. నిచ్చెనల సహాయంతో భవనంలోని మహిళలు, చిన్నారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో 21 మంది అస్వస్థతకు గురైనట్లు పోలీసులు తెలిపారు. వారిలో 8 మంది అపస్మారస్థితిలో ఉన్నారని.. వారందరినీ ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

**కెమికల్ డ్రమ్ముల కారణంగా పైఅంతస్తులకు మంటలు: డీసీపీ –** బజార్‌ఘాట్‌లో ఘటనాస్థలాన్ని డీసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో గ్యారేజ్ ఉంది. అక్కడ కారు రిపేర్ చేస్తుండగా మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో డీజిల్, కెమికల్ డ్రమ్ములు ఉన్నాయి. దీంతో మంటలు వాటికి అంటుకుని అపార్ట్‌మెంట్‌లోని పైఅంతస్తులకు వ్యాపించాయి. అందులోని మూడు, నాలుగు అంతస్తుల్లో కొన్ని కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. అగ్నిప్రమాదంతో పొగ వల్ల ఊపిరాడక కొందరు చనిపోయారు. ముగ్గురికి గాయాలయ్యాయి" అని చెప్పారు.

**మృతులు..** మహమ్మద్ ఆజామ్ (58) రెహనా సుల్తానా (50) ఫైజా సమీన్ (26) తాహూరా ఫరీన్ (35) టూబా టరూబా (13) జకీర్ హుస్సేన్ (66) హాసిబ్ ఉర్ రహ్మాన్ (32)నికత్ సుల్తానా (55)

# ధరణితో మీ భూములను ఎవరూ గోల్‌మాల్ చేయలేరు : సీఎం కేసీఆర్



బూర్గంపాడు : ధరణి పోర్టల్‌తో రైతుల భూములను ఎవరూ గోల్‌మాల్ చేయలేరని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. భద్రాచలం, పినపాక నియోజకవర్గాల బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ బూర్గంపాడులో జరిగింది. సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ అభ్యర్థులు రేగా కాంతారావు, తెల్లం వెంకట్రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎన్నికలకు చాలా సమయం ఉన్నది. గ్రామాలు, పట్టణాలకు బస్తీలకు వెళ్లిన తర్వాత పెద్ద మనుషులతో చర్చ పెట్టాలి. నిజానిజాలు తేల్చాలి. వాస్తవాలను గమనించి ముందుకుపోతే మన బతుకులు బాగుపడుతయ్. లేక పోతే దెబ్బతింటాం. బాధలు పడుతాం' అన్నారు.

**పార్టీల వైఖరిపై చర్చ చేయాలి..** 'బీఆర్ఎస్ పుట్టుక మీ కండ్లముందే జరిగింది. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల హక్కులు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం. కాంగ్రెస్ చరిత్ర మీకు తెలుసు. 120–130 సంవత్సరాల కిందట పుట్టింది. బీఆర్ఎస్ పార్టీ చరిత్ర కూడా మీముందుంది. ఈ పార్టీల వైఖరిపై బాగా చర్చచేయాలని కోరుకుంటున్నా. ఈ ఎన్నిక పినపాక వరకు భద్రాచలం వరకో ఉండదు. ఇక్కడ గెలిచే అభ్యర్థులను బట్టి రాష్ట్రం ప్రభుత్వం ఏర్పడుతుంది. ఆ ప్రభుత్వం సరైన నడక నడిస్తే ప్రజాబాహుల్యానికి మేలు జరుగుతుంది. లేకపోతే నష్టం వచ్చే అవకాశం ఉంటుంది. ఇక్కడ గిరిజనులు విశేషంగా ఉండే ప్రాంతం. గిరిజనులతో పాటు దళిత వర్గాల ప్రజలు ఉన్నరు. వాళ్ల బతుకులు బాగా లేవు. వాళ్లకు భూములు కూడా లేవు. అది వాస్తవం' అన్నారు.

**దళితుల బతుకులు అట్లనే ఎందుకున్నయ్..?** 'దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా.. దళితుల బతుకులు అట్లనే ఎందుకున్నయ్ ? దీనికి బాధ్యులు ఎవరూ ? యుగయుగాలు, తరతరాలుగా అణచివేబడ్డ జాతికి స్వతంతం వచ్చిన తెల్లవారి నుంచే మంచి కార్యక్రమాలు పెట్టి ఉంటే దళితుల బతుకులు ఇలా ఉండేవి కావు. అందు కోసమే తెలంగాణ ప్రభుత్వం దళితబంధు కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. తెలంగాణ వచ్చిన నాడు పరిస్థితి ఏంటో మీకు తెలుసు. కరెంటు, తాగు, సాగునీటి సమస్యలు. చేనేత కార్మికుల ఆత్మహత్యలు, రైతుల వలసలు, ఆకలి చావులు. అప్పులు కట్టలేక.. బోర్లు వేయలేక.. కరెంటు సరిగా రాక దారుణమైన పరిస్థితి ఉండేది. ఎలా వెళ్లాలో అర్థంకాని పరిస్థితి. కష్టపడి రాష్ట్రం తెచ్చుకున్నాం కాబట్టి బాధ్యతతో పటిష్టంగా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ముందుకెళ్లాలని కంకణబద్ధులమై పని చేశాం' అని తెలిపారు.

**మా ప్రాధాన్యం వాటికే..** 'పది సంవత్సరాల పరిస్థితి, చరిత్ర మీ కండ్ల ముందున్నది. అన్నింటికన్నా ముందు మేం ఇచ్చిన పాధ్రాన్యం. రోడ్లు, సాగునీరు, తాగునీరు, కరెంటు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. మీరందరూ చూస్తున్నారు. మీ ముందే మణుగూరులో భద్రాద్రి పవర్ ప్లాంట్ వచ్చింది. ఒకప్పుడు వాస్తవానికి వీటీపీఎస్ విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ మణుగూరులో రావాల్సింది. కానీ, సమైక్యవాదులు కుట్ర చేసి మణుగూరుకు రాకుండా విజయవాడకు తరలించారు. అందువల్ల మనం చాలా నష్టపోయాం. కనీసం చిన్నదైనా సరే ఇక్కడైనా రావాలని చెప్పి మణుగూరులో పవర్ ప్లాంట్ పెట్టుకున్నాం. ఎంతో కొంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దాని ద్వారా లభిస్తున్నయ్. అన్నింటిని మించింది ప్రధాన రంగం వ్యవసాయరంగం. రైతులు అప్పుల్లో ఉన్నారు. అప్పులు కట్టలేక చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఆ బాధలు పోవాలని.. రైతులు చక్కగా బతకాలని.. వ్యవసాయ స్థిరీకరణ జరగాలని ఎన్నో ప్రయత్నాలు చేశాం. అందులో విజయం సాధించాం' అన్నారు.

**దేశంలో దుర్మార్గమైన పాలసీలతో రైతులకు సపోర్ట్ లేదు....** 'ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా ప్రభుత్వం సపోర్ట్ లేకుండా వ్యవసాయం నిలబడలేదు. అన్ని దేశాల్లో సబ్సిడీలు ఇచ్చి వ్యవసాయానికి సపోర్ట్ చేస్తున్నాయ్. మన దేశంలో ఉన్న దుర్మార్గమైన పాలసీల వల్ల రైతులకు ఎలాంటి సపోర్ట్ లేదు. అందుకే మన దగ్గర రెండు మూడు కార్యక్రమాలు తీసుకున్నాం. రైతులకు ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరా చేస్తే నీటి తీరువా లేదు. గతంలో ఉన్న బకాయిలను రద్దు చేశాం. మోటర్లు కాలిపోకుండా నాణ్యమైన 24గంటలు ఉచితంగా ఇస్తున్నాం. పెట్టుబడి సాయం ఇస్తున్నాం. రైతులకు ఏదైనా ఇబ్బంది జరిగి చనిపోతే ఆ వారి ఇంటికి రూ. 5లక్షలు వారం రోజుల్లో వస్తున్నయ్. రైతుబీమా బ్రహ్మాండంగా పని చేస్తున్నది. రైతుల గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. వీటన్నింటిని తీసుకువచ్చి ధరణి పోర్టల్ తీసుకువచ్చాం. ప్రభుత్వం తన వద్ద ఉన్న అధికారాన్ని మీకే ఇచ్చింది. మీ భూమి యాజమాన్యం మారాలంటే.. గతంలో ప్రభుత్వ అధికారులు మార్చేది. ఈ రోజు ఆ పరిస్థితి లేదు. మీ బొటన వేలు పెడితే తప్ప.. మీ భూమిని ఎవరూ గోల్‌మాల్ చేయలేరు. ఇప్పుడిప్పుడే రైతులు తేరుకుంటున్నర్. అప్పుల నుంచి తేరుకుంటున్నరు' అన్నారు.

# సంపాదకీయం

## వార్నింగులతోనే బీజేపీకి సరిపోతోందిగా...?

అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరినీ వదలం అని బీజేపీ పెద్దలు అంటున్నారు. కానీ కొన్ని అనుమానాలు అలాగే ఉంటూ వస్తున్నాయి. లిక్కర్ స్కాం కేసులో కేసీయార్ తనయ కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదు అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం బ్యారేజ్ కృంగితే దాని మీద ఎందుకు సీబీఐ విచారణకు ఆదేశించలేదు అని రేవంత్ రెడ్డి లాంటి వారు ప్రశ్నిస్తున్నారు. ఇక చూస్తే ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణాలో అధికారాన్ని బీజేపీకి ఇవ్వమని కోరుతున్నారు. అవినీతిపరులను జైళ్ళకు పంపించి తీరుతామని కూడా వార్నింగులు ఇస్తున్నారు. అయితే కేసీయార్ ఫ్యామిలీ అవినీతికి పాల్పడింది అని చెబుతూ మీనమేషాలు ఎందుకు బీజేపీ పెద్దలు లెక్కబెడుతున్నారు అన్నదే పాయింట్. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు అన్నీ బీజేపీ పెద్దల చేతిలోనే ఉంటాయి. ప్రతిష్టాత్మకమైన సీబీఐ కూడా కేంద్రం వద్దనే ఉంది. మరి అవినీతి జరిగింది అని చెబుతూనే ఎపుడో అరెస్ట్ చేస్తాం, జైలు దారి చూపిస్తామని చెప్పడం ఎందుకు అని అంటున్నారు. ఇలా వార్నింగులతోనే సరిపెట్టడం ఏంటి అని అడుగుతున్న వారూ ఉన్నారు ఇంకాస్త వెనక్కి వెళ్తే ఏపీలో పోలవరం చంద్రబాబుకు ఏటీఎం గా మారింది అని నాటి సీఎం మీద ఏలూరు సభలో మోడీ ప్రధాని హోదాలో కీలకమైన ఆరోపణలు చేశారు. ఆ తరువాత మాత్రం చర్యలు ఏవీ లేవు అని అంటున్నారు. మరి నిజంగా బాబు తప్పు చేశారా లేక ఎన్నికల ప్రసంగాలలో ఇది భాగంగా చేసుకుని కామెంట్స్ చేస్తున్నారా అన్నదే చర్చకు వస్తోంది. ఇక్కడే కేంద్ర ప్రభుత్వం మాటల వరకే పరిమితం అవుతోంది అని అంటున్నా వారూ ఉన్నారు. అయితే అన్ని చోట్లా ఒకే నీతి రాజకీయ రీతి అమలు చేయడం లేదు అని కూడా ఎత్తి చూపుతున్నారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వ మంత్రుల మీద జోరు చేశారు. ఈడీ కేసులు ఏకంగా అక్కడి సీఎం మీద కూడా పెట్టారు. అలాగే బీయారెస్ ఆరోపిస్తున్న విషయం చూస్తే సోనియా గాంధీ రాహుల్ గాంధీ మీద ఈడీ కేసులు ఉన్నాయి, మరి తదుపరి చర్యలు ఏవీ అని. అదే విధంగా రేవంత్ రెడ్డి లాంటి వారు అడుగుతోంది లిక్కర్ కేసులో అనేక సార్లు పిలిపించి ఈడీ కవితను విచారించి చివరికి అరెస్ట్ ఎందుకు చేయలేదని. ఇలా బీయారెస్ తో బీజేపీ కుమ్మక్కు అని కాంగ్రెస్ ఆరోపిస్తూంటే బీజేపీ కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీయార్ అంటున్నారు. మేడిగడ్డ వద్ద కృంగింది అని కాంగ్రెస్ హడావుడి చేస్తే ఏకంగా కేంద్రం రిపోర్టు ఇచ్చేస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తానికే ఏదో అయిపోయిందని కాంగ్రెస్ బీజేపీలు అంటున్నాయని ఆయన విమర్శిస్తున్నారు. మరో వైపు చూస్తే ప్రధాని నరేంద్ర మోడీ అయినా అమిత్ షా అయినా ఇతర బీజేపీ పెద్దలు అయినా హెచ్చరికలు చేస్తూ ప్రత్యర్థుల మీద సీరియస్ కామెంట్స్ చేస్తున్నారు. కానీ జనంలో అవి ఎంతవరకూ పట్టింపుగా ఉంటున్నాయన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి ఎందుకంటే తెలంగాణాకు వచ్చిన ప్రతీసారీ విమర్శలు చేయడం అవినీతి అని చెప్పడం, కుటుంబ పార్టీలు అని నిందించడం తప్ప నిజంగా యాక్షన్ లోకి ఎందుకు దిగరు అన్న డౌట్లు కూడా వస్తున్నాయి. ఇక బీసీ ముఖ్యమంత్రి అని బీజేపీ చేస్తున్న ప్రచారం లో కూడా డొల్లతనాన్ని విపక్షాలు ఎండగడుతున్నాయి. బీసీ బీజేపీ ప్రెసిడెంట్ గా ఉంటే ఆయన్ని తప్పించేశారు. ఆ ప్లేస్ లో కిషన్ రెడ్డిని తెచ్చారు. ఇపుడు మాత్రం బీసీని సీఎం ని చేస్తామని చెప్పడం వల్ల బీజేపీ మీద నమ్మకం ఉంటుందా అని అడుగుతున్న వారూ ఉన్నారు. బీజేపీ చెప్పేది ఒకటి చేసేది మరొకటి అన్నట్లుగానే ఆది నుంచి తెలంగాణాలో చేస్తోంది అని అంటున్నారు. దాంతోనే బీజేపీ గ్రాఫ్ ఇపుడు ఒక్కసారిగా పడిపోయింది అని అంటున్నారు. ఏది ఏమైనా హెచ్చరికలు ఇస్తే చప్పట్లు సభకు వచ్చిన వారి చేత కొట్టించుకోవచ్చు, కానీ ఓట్లు వేయాల్సిన కోట్లాదిమంది ఆ హెచ్చరికల వెనకాల ఉన్న చిత్తశుద్ధిని చూస్తారు అని అంటున్నారు. సో బీజేపీ తెలంగాణాలో చేస్తున్న ఎన్నికల పోరాటంలో ఎంత దూరం వెళ్ళింది అన్నది ఫలితాలే చెప్పాల్సి ఉంది.

# జిల్లా లో మొత్తం నామినేషన్లలు 261...

**అర్హత పొందిన వారు 190 మంది అభ్యర్థులు,**
**71 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ....**
**మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.**



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాఖలైన నామినేషన్ల పరిశీలన (స్క్రుటినీ) ప్రక్రియ సోమవారం నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల లో ఈ సందర్భంగా 71 మంది అభ్యర్థులు దాఖలు చేసిన అన్ని సెట్ల నామినేషన్లు వివిధ కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యాయని వివరించారు. ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 261 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా, స్క్రుటినీలో 71 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించబడ్డాయని తెలిపారు. 190 మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయని అన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 67 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు కాగా, 38 అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని కలెక్టర్ తెలిపారు. మల్కాజ్గిరి నియోజకవర్గంలో 41 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు కాగా, 8 మంది నామినేషన్లు తిరస్కరించబడ్డాయని అన్నారు. కుతుబుల్లా పూర్ నియోజకవర్గంలో 22 మంది అభ్యర్థులవి చెల్లుబాటు కాగా, 10 అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ అయ్యాయని వివరించారు. కూకటిపల్లి అర్బన్ సెగ్మెంట్ లో 26 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు కాగా, 12 మంది అభ్యర్థులవి తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో 34 మంది అభ్యర్థుల నామపత్రాలు చెల్లుబాటు అవగా, 3 నామినేషన్ తిరస్కరించబడిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, తెలిపారు.

# ఫిర్యాదులు, సలహాలు, సూచనలకై పరిశీలకులను సంప్రదించవచ్చు....

**మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్**



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులను భారత ఎన్నికల కమిషన్, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు సలహాలు, సూచనలు, ఫిర్యాదులు,చేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్,సూచించారు. జిల్లాలోని, మేడ్చల్,(43 ) నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్, ఎస్.కె.జైన్, (ఐ.ఏ.ఎస్), మల్కజగిరి(44) ,ఉప్పల్, (45)నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ పూర్వా గార్గ్,(2015) ఐఏఎస్, ను కుత్బుల్లాపూర్,(45 ) కూకట్ పల్లి,(46 ) నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ అమన్ మిట్టల్ ,(ఐ.ఏ.ఎస్), లను నియమిచ్చారు అని తెలిపినారు. ఎన్నికల సంబంధిత అంశాలపై ఫిర్యాదులు చేయదలచిన వారు మేడ్చల్,(43 ) నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్, ఎస్.కె.జైన్, (ఐ.ఏ.ఎస్), సెల్ నెంబర్ 73370-47775 కు ఫోన్ చేయవచ్చని, మేడ్చల్ రిటర్నింగ్ ఆఫీస్ లో ప్రతిరోజూ 12.00 గంటల నుండి 1 .00 గంటల మధ్యన నేరుగా కలువవచ్చని తెలిపారు. మల్కజగిరి(44) ,ఉప్పల్, (45)నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ పూర్వా గార్గ్,(2015) ఐఏఎస్, సెల్ : 73370-47776, వీరిని కలెక్టరేట్ లోని మొదటి అంతస్తు లో %ఖీ%- 26 లో ప్రతిరోజూ సాయంత్రం 4.00 నుండి 5 .00 గంటల మధ్యన నేరుగా కలువవచ్చని తెలిపారు. కుత్బుల్లాపూర్,(45 ) కూకట్ పల్లి,(46 ) నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ అమన్ మిట్టల్ ,(ఐ.ఏ.ఎస్) , సెల్ : 73370-47778, ద్వారా సంప్రదించవచ్చని ,. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్, ప్రగతి నగర్ లో ప్రతిరోజూ సాయంత్రం 4.00 నుండి 5 .00 గంటల మధ్యన నేరుగా కలువవచ్చని తెలిపారు. . జిల్లా లో ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు అబ్జర్వర్లు జిల్లాలోనే ఉండి ఎన్నికల సంబంధిత అంశాలను పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు.

# తన కళాశాలలను విశ్వవిద్యాలయంగా మలచుకోవడం తెలుసుగాని,తనను గెలిపించిన ప్రజల కోసం ఒ డిగ్రీ కళాశాల కూడా తెలీని మంత్రి మల్లారెడ్డిని ప్రజలు నమరు గాక నమరు....

**మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్**



శామీర్ పేట (గరుడ వార్త) : మంత్రి మల్లారెడ్డి ప్రజలకు చేసింది ఏమి లేదని, కేవలం తనకోసం, తనవల్లకోసం మాత్రమే మంత్రి మల్లారెడ్డి పనిచేశారని ఆరోపించారు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్. మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరిపల్లి, అంతాయిపల్లి, బిట్స్ కాలనీ, మందాయిపల్లి, సింగాయిపల్లి, హకింపేట్, పోతాయిపల్లి, ఎలిగెలగూడ, మల్లన్న కాలనీ, దేవరయాంజాల్, తూంకుంట ప్రాంతాల్లో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య యాదవ్ మాట్లాడుతూ మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి చేయడం పక్కన పెట్టి భూ కబ్జాలకు పాల్పడుతూ తన ఆస్తులను పెంచుకున్నారని ఆరోపించారు. మల్లారెడ్డి తన కాలేజ్ విద్యార్థులను, టీచర్లను ఉపయోగించి ఓటర్లకు డబ్బులు పంచిపెడుతూ రాజకీయాన్ని అవినీతి పరం చేస్తున్నారని అన్నారు. ఎన్నికుట్రలు పన్నినా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రావడం కాయమని, మేడ్చల్ నుండి కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలువబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, శామీర్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై ఎస్. గౌడ్, తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార ధోరణి తప్ప రాజకీయ అనుభవం లేని వ్యక్తి ప్రజల సమస్య ఎలా తీర్చగలుగుతాడు

**మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి**
**కుటుంబ పాలనే తప్ప, కష్టపడే వారికి స్థానం లేదు : సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి.**
**రోజురోజుకు కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న చేరికలు**



శామీర్ పేట (గరుడ వార్త) : రిబ్బన్లు కట్ చేసి, ఫోటోలు దిగినంత మాత్రాన నాయకుడు కాలేడని, ప్రజల్లో మెలిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నవాడే అసలైన నాయకుడు అవుతాడని మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం శామీర్ పేట మండల అలియాబాద్ గ్రామంలో సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ కాంగ్రెస్ ర్యాలీ నిర్వహించారు. తదనంతరం ఇతర పార్టీలకు చెందిన సుమారు వందమంది నాయకులు, యువకులు మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రి మల్లారెడ్డి పాలనపై మేడ్చల్ నియోజకవర్గం ప్రజలు విసిగిపోయి ఉన్నారని అన్నారు. ఈసారి మేడ్చెల్ లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి మాట్లాడుతూ పథకాలు పేరుకు మాత్రమే ప్రవేశపెడుతున్నారని, అయితే అవసరం ఉన్నవారికి అర్హులకు మాత్రం అవి అందడం లేదన్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా మంత్రి మల్లారెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వైఎస్ గౌడ్, మూడు చింతలపల్లి మండల అధ్యక్షులు బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మజీద్ పూర్ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి, నాయకులు, ముజీబ్, బండి రాంరెడ్డి, ముద్దం సుధాకర్ రెడ్డి, శంకర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ చికిత్స

గోదావరిఖని : ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ఐఎస్ఓ తరహాలో నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. జాతీయ ఆరోగ్య మిషన్ పరిశీలన బృందం కేటాయించే మార్కుల ఆధారంగా జాతీయ స్థాయిలో అవార్డులు ప్రకటిస్తూ ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తోంది. తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలు 'ఎన్క్వాష్' ధ్రువీకరణకు ఎంపిక కాగా ఇటీవలె గోదావరిఖని, సుల్తానాబాద్ ఆసుపత్రులను 'ముస్కాన్' ధ్రువీకరణ కోసం పరిశీలించారు. తల్లీ బిడ్డల ఆరోగ్యంతో అనుబంధాన్ని పెంచేలా కరీంనగర్, గోదావరిఖని ఆసుపత్రుల్లో 'కంగారూ' విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిని 'లక్ష్య'కు ఎంపిక చేయగా పెద్దపల్లిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోని పలు ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో 'కాయకల్ప' పరిశీలన పూర్తికాగా ఫలితాలు వెలువడాల్సి ఉంది. నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు లక్ష్య, ఎన్క్వాష్, ముస్కాన్, స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో 'కాయకల్ప' పోటీలను కేంద్రం నిర్వహిస్తుంది. ఈ పోటీల్లో ఎంపికైన ఆసుపత్రులకు ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాల్లో 25శాతం సిబ్బందికి చెల్లిస్తూ మిగతా 75 శాతం నిధులను ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది.స్వచ్ఛతలో 'కాయకల్ప'

ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో స్వచ్ఛతను పెంపొందించాలనే లక్ష్యంతో జాతీయ స్థాయిలో స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో 'కాయకల్ప' పోటీలను నిర్వహిస్తోంది. గతంలో పెద్దపల్లి జిల్లా లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరుసగా రెండు సార్లు కాయకల్పకు ఎంపికైంది. తాజాగా జూలపల్లిలోని ప్రాథమిక, అడ్డగుంటపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దూళికట్టలోని ఆరోగ్య ఉపకేంద్రం(పల్లె దవాఖానా)ను జిల్లాస్థాయి కమిటీ ఎంపిక చేసింది. త్వరలో రాష్ట్ర, జాతీయ స్థాయి కమిటీలు పరిశీలించాక సంతృప్తికరమైన మార్కులు వస్తే 'కాయకల్ప అవార్డునకు ఎంపిక కానున్నాయి.

మెరుగైన సేవలకు 'లక్ష్య'

సహజ ప్రసవాలు, శస్త్ర చికిత్సతో ప్రసవాల విభాగాల్లో మొత్తం 148 అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. 'లక్ష్య'లో ఎంపికైన ఆసుపత్రికి ఒక్కో విభాగానికి రూ.3 లక్షల చొప్పున రెండు విభాగాల్లో రూ.6 లక్షల ఆర్థిక ప్రోత్సాహకాన్ని వరుసగా మూడేళ్లు ప్రభుత్వం అందిస్తుంది. మూడేళ్ల కిత్రం గోదావరిఖని ఆసుపత్రి 'లక్ష్య'కు ఎంపిక కాగా గడువు ముగియడంతో తాజాగా మరోసారి పరిశీలన పూర్తి చేసి లక్ష్యకు ఎంపిక చేశారు.

చిన్నారుల్లో చిరునవ్వు 'ముస్కాన్'

చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులను పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్రం 'ముస్కాన్' పథకాన్ని ప్రవేశపెట్టింది. గోదావరిఖని, సుల్తానాబాద్ ఆసుపత్రులను ఇటీవలె ముస్కాన్ ప్రతినిధులు పరిశీలించగా ఫలితాలు వెలువడాల్సి ఉంది. పిల్లల్లో మానసిక, శారీరక ఉల్లాసం కల్పించేలా ఆట వస్తువులతో పాటు ఆసుపత్రిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పాల్సి ఉంటుంది.

నాణ్యతా ప్రమాణాలకు 'ఎన్క్వాష్'

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగు పరచాలనే లక్ష్యంతో 'ఎన్క్వాష్'(నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్)ను రూపొందించారు. లక్ష్మీపురం ఆరోగ్యకేంద్రం ఈ పథకానికి ఎంపికవడంతో రూ.3 లక్షల చొప్పున అందించనున్నారు. వివిధ విభాగాల్లో వైద్య సేవలు, నిర్వహణ తీరు, రోగులతో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ఇప్పటివరకు ఆసుపత్రులు, పీహెచ్‌సీలకు మాత్రమే వర్తింపజేయగా ఈసారి ఉప కేంద్రాలకు వర్తింపజేశారు.

సిబ్బందికి ప్రోత్సాహం.. మెరుగైన వైద్యం
-అనిల్‌కుమార్, జిల్లా నాణ్యతా మేనేజర్

కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలతో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు ప్రోత్సాహం అందుతుంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్య సేవలను అందుబాటులోకి తేవడమే కేంద్రం లక్ష్యం. ఆసుపత్రి స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో మొత్తం నాలుగు విభాగాల్లో పరిశీలనలు ఉంటాయి. .

# ఇక గడువులు లేవు.. వసూలే..!

2021-22 యాసంగి సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సిన మిల్లర్లు ఈ నెలాఖరు వరకు పెట్టాలని మరో గడువు ఇస్తూ కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈనెల 31 వరకు ఉన్న బకాయి బియ్యం లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించింది. ఇక ఈ యాసంగికి సంబంధించి ఎలాంటి గడువు ఇచ్చే ప్రసక్తి లేదని ఉత్తర్వులో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తం అయిన ప్రభుత్వం రబీ బియ్యం బకాయి ఉన్న మిల్లులకు నోటీసులు జారీ చేసింది. ఈనెలాఖరు వరకు తమ లక్ష్యాన్ని పూర్తి చేయాలని, లేని పక్షంలో జరిమానాలు విధించి బకాయి బియ్యం వసూలు చేస్తామని అధికారులు మిల్లులకు స్పష్టం చేశారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో నల్గొండ జిల్లా జిల్లాకు కేటాయించిన 2,22,053 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని 100 శాతం పూర్తి చేసింది. యాదాద్రి జిల్లా నుంచి 1,39,357 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రావాల్సి ఉండగా.. అందులో 1,38,547 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ఇక కేవలం 810 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రం పెట్టాల్సి ఉంది. ఇక సూర్యాపేట జిల్లాలో మాత్రం 43,984 మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా బకాయి ఉన్నాయి. ప్రతి సంవత్సరం కూడా సీఎంఆర్ పెట్టే విషయంలో సూర్యాపేట జిల్లా మిల్లర్లు కొందరు సతాయిస్తూ వస్తున్నారు. ఈ జిల్లాలోని మిల్లర్లు కోట్ల రూపాయల బియ్యం ఎగవేతకు ప్రయత్నాలు చేస్తున్నారని గత సంవత్సరం ఫిర్యాదులు కూడా వచ్చాయి. జిల్లాలో దాదాపు 36 మంది మిల్లర్లకు గతంలో నోటీసులు ఇవ్వటం, కొన్ని మిల్లులను సీజ్ చేయటం లాంటి చర్యలు తీసుకున్న తరువాత కొందరు మిల్లర్లు ముందు కు వచ్చారు.సూర్యాపేట జిల్లా నుంచి గత యాసంగిలో 1,44,904 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యం ఉండగా.. ఇప్పటి వరకు 1,00,920 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే పెట్టారు. మిగిలిన లక్ష్యం పూర్తి చేసేందుకు ఈనెలాఖరు వరకు గడువు ఇచ్చారు. ఈ మిల్లుల నుంచి బియ్యం లక్ష్యాలను పూర్తి చేసేందుకు పోలీసులు కూడా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అయినా నేటికీ లక్ష్యాన్ని పూర్తి చేయలేకపోయారు.

ధాన్యం నిల్వలపై అనుమానాలే..ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసి ఇచ్చేందుకు మిల్లులకు కేటాయిస్తుంది. ధాన్యం తీసుకున్న మిల్లర్లు తీసుకున్న తేదీ నుంచి 15 రోజుల్లో బియ్యం ఇవ్వాలి. కానీ మిల్లర్లు బియ్యం ఇవ్వకుండా కేటాయించిన ధాన్యాన్ని ఇతర వ్యాపార అవసరాలకు వాడుకున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

# గ్రేటర్‌లో.. మెజార్టీలు అంతంతే

హైదరాబాద్: నగర తీర్పుపై ఎప్పుడూ అంతుపట్టని పరిస్థితే ఉంది. ఎవరు విజయం సాధిస్తారు అనే విషయం చెప్పలేం.. గత నాలుగైదు సార్లు జరిగిన ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. మెజార్టీలు అత్యల్పంగానే నమోదవుతున్నాయి. నాలుగైదు నియోజకవర్గాలు మినహా ఎక్కడా 50 వేలకు మించి మెజార్టీ వచ్చిన దాఖలాలు లేవు. కేవలం 5 వేల నుంచి 25 వేల మెజార్టీతోనే ఇక్కడ గెలుపోటములు నమోదవుతూ వస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో అత్యధిక నియోజకవర్గాల్లో మెజార్టీ కేవలం 20వేల లోపే కనిపిస్తోంది.

సికింద్రాబాద్‌లో 2014 ఎన్నికల్లో 25,979 ఓట్ల మెజార్టీతో భారాస అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ తెదేపా అభ్యర్థి కె.వెంకటేశ్‌గౌడ్‌పై విజయం సాధించారు. 2009లో తెదేపా అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి జయసుధ 4,395 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2018లో 45,470 ఓట్ల ఆధిక్యతతో భాజపా అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌పై భారాస అభ్యర్థి పద్మారావు విజయం సాధించారు. 2014లో కంటోన్మెంట్ తెదేపా అభ్యర్థి సాయన్న 3,275 ఓట్ల మెజార్టీతో భారాస అభ్యర్థి గజ్జెల నగేష్‌పై విజయం సాధించగా.. 2009లో తెదేపా అభ్యర్థి సాయన్నపై కాంగ్రెస్ అభ్యర్థి శంకరరావు 4,183తో విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వే సత్యనారాయణపై 37,563 ఓట్ల మెజార్టీతో భారాస తరఫున పోటీ చేసిన సాయన్న విజయం సాధించారు.

2014లో జూబ్లీహిల్స్ తెదేపా అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ 18,436 ఓట్ల మెజార్టీతో మజ్లిస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై విజయం సాధించారు. 2009లో తెదేపా అభ్యర్థి మహ్మద్ సలీమ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి



పి.విష్ణువర్ధన్‌రెడ్డి 22,086 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2018 వచ్చేసరికి భారాస అభ్యర్థిగా బరిలోకి దిగిన మాగంటి గోపీనాథ్ 16,004 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి పి.విష్ణువర్ధన్‌రెడ్డిపై విజయం సాధించారు. 2014లో ఎల్బీనగర్‌లో తెదేపా అభ్యర్థి ఆర్.కృష్ణయ్య 12,525 ఓట్ల మెజార్టీతో భారాస అభ్యర్థి ఎం.రామ్మోహన్‌గౌడ్‌పై విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి 13,142 ఓట్ల మెజార్టీతో తెదేపా అభ్యర్థి ఎస్.వి.కృష్ణప్రసాద్‌పై విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కేవలం 1,939 ఓట్ల మెజార్టీతో భారాస అభ్యర్థి ఎం.రామ్మోహన్‌గౌడ్‌పై విజయం సాధించారు. 2014లో ఇబ్రహీంపట్నంలో తెదేపా అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 11,056 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై విజయం సాధించారు. 2009లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెదేపా తరఫున కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై 9,216 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2018లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భారాస తరఫున పోటీ చేసి బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై కేవలం 376 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

# ఆర్టీసీకి ఆదాయమే ప్రధానమా?

కరీంనగర్ : ప్రతి రోజు కరీంనగర్ బస్టాండ్ నుంచి వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వారికి సౌకర్యాలు కల్పించాల్సిన ఆర్టీసీ.. ఉన్న పార్కింగ్ స్థలాన్ని టెండర్ వేసి వాహనాలు నిలపడానికి వీలు లేకుండా చేస్తోంది. అధికారుల తీరుపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో 45 ప్లాట్‌ఫాంలు ఉండగా నిత్యం 1500కుపైగా బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. 85 వేల మందికిపైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు.

వాహనాలు నిలిపేదెలా?

కరీంనగర్ బస్టాండ్‌లోకి మధ్య దారిలో నుంచి వెళ్లే దారిలో కుడి, ఎడమ వైపు ఉన్న రెండు పార్కింగ్ స్థలాలను ద్విచక్ర వాహనాలకు టెండర్ ద్వారా కేటాయించారు. వీటి ద్వారా సంస్థకు లక్షలాది రూపాయాల ఆదాయం సమకూరుతోంది. కుడి వైపు ఉన్న మరో ఖాళీ స్థలాన్ని పికప్, డ్రాపింగ్ కోసం వచ్చే వారు తమ వాహనాలను నిలపడానికి వీలుగా ఉంచారు. ప్రస్తుతం ఆ స్థలానికి కూడా ఆర్టీసీ అధికారులు టెండరు పిలవడం చర్చనీయాంశంగా మారింది. 6 వేలు స్క్వేర్ పీట్ల స్థలాన్ని, నెలకు రూ.1.60 లక్షలకు టెండరు ఖరారు



అయినట్లు అధికారులు తెలిపారు.

భద్రత సిబ్బందితో వాగ్వాదం...

ఉచితంగా వాహనాలు నిలిపే పార్కింగ్ స్థలాన్ని గుత్తేదారుకు కట్టబెట్టాలని చూడటం, అందులో ఉన్న చెట్లను తొలగిస్తారంటూ ద్విచక్ర వాహనాలు, కార్లను లోనికి వెళ్లకుండా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంటున్నారు. వాహనదారులకు, సెక్యూరిటీ సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటుంది. వాహనాలను బైక్ పార్కింగ్‌లో నిలపాలని సూచిస్తున్నారని, పది నిమిషాలు, అరగంట కోసం రూ.30 చెల్లించాలా? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కుటుంబ సభ్యులను బస్సు ఎక్కించడానికి వచ్చాం, వాహనాన్ని ఎక్కడ నిలపాలంటూ ప్రశ్నించడం కనిపించింది. ఆర్టీసీ ప్రతి దాన్ని వ్యాపారంతో కాకుండా కొంత సేవా దృక్పథంతో కూడా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మొత్తం స్థలాన్ని ఇవ్వడం లేదు

ఖాళీ స్థలం మొత్తాన్ని ఇవ్వడం లేదు. కేవలం ఆరు వేల స్క్వేర్ ఫీట్ల స్థలానికి మాత్రమే టెండర్ పిలిచాం. స్థలాన్ని ఇప్పటివరకు గుత్తేదారుకు అప్పగించలేదు. పికప్, డ్రాపింగ్‌కు వచ్చే వారి వాహనాలు నిలపడానికి వీలు కల్పిస్తాం. పీవో ఎం.చంద్రయ్య

# ఎన్నికల ఫిర్యాదులకు 100 నిమిషాల్లో పరిష్కారం




పాల్వంచ : ఇల్లెందు నియోజకవర్గంలో ఎన్నికల నిబంధనల కు విరుద్ధంగా ఓ పార్టీ వారు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని మరో పార్టీ నాయకుడు 'సీ విజిల్' యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎన్నికల అధికారులు తగిన చర్యలు చేపట్టి ఫిర్యాదును పరిష్కరించారు. భద్రాచలం నియోజకవర్గంలో ఓ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా గోడపత్రాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని మరో ఫిర్యాదు అందింది. ఆ ఏరియా ఎన్నికల అధికారులు స్పందించి వెంటనే నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేశారు.

జిల్లాలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న పలువురు యువకులు '1950' టోల్ ఫ్రీ నంబరును సంప్రదించి ఓటు వచ్చిందా? లేదా? అని నిర్ధారించుకుంటున్నారు. ఓటరు గుర్తింపు కార్డు, వివరాలు, పోలింగ్ స్టేషన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. వారి ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం లభిస్తుండటం విశేషం.

ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేందుకు భారత ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ఉల్లంఘనలపై స్థానిక పౌరులు స్పందించేలా చైతన్యపరుస్తోంది. ఓటర్లను ప్రభావితం చేస్తున్న అభ్యర్థులు, నాయకులపై ప్రజలెవరైనా సులభంగా ఫిర్యాదు చేసేందుకు 'సీ విజిల్' యాప్‌ను ఆధునికీకరించింది. ఎన్నికల్లో అక్రమాలు, ప్రలోభాలు, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఆయా ఫిర్యాదులు నేరుగా జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ దృష్టికి చేరతాయి. సదరు పాలనాధికారి స్థానిక ఏరియాలోని ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టీ) అధికారులకు ఆదేశాలు జారీ చేసి విచారణ చేపడతారు. కేవలం వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ఆ వివరాలను ఫిర్యాదు చేసిన వారికి ఫోన్‌లో సంక్షిప్త సందేశాల ద్వారా వివరిస్తున్నారు. ఈ వివరాలు సైతం గోప్యంగా ఉంచుతున్నారు.

హెల్ప్‌లైన్‌తో.. నిరంతర సేవలు

ఓటు వివరాలు, ఎన్నికల సమాచారం సులభంగా తెలుసుకునేందుకు 'ఓటరు హెల్ప్‌లైన్-1950' టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తెచ్చారు. దీన్ని సంప్రదించి ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది? చేర్పులు, మార్పులు, తొలగింపునకు సంబంధించిన తాజా సమాచారం? కొత్త దరఖాస్తు స్టేటస్? వంటివి వెంటనే తెలుసుకోవచ్చు. సమాధానాలు చెప్పేందుకు 24 గంటలు.. సెలవు రోజుల్లోనూ సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఆండ్రాయిడ్ ఫోన్ సదుపాయం ఉన్నవారు 'గూగుల్ సెర్చ్'లో 'హెల్ప్‌లైన్-1950'ను ఎంటర్ చేస్తే భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ప్రత్యక్షం అవుతుంది. ఈ వెబ్‌సైట్‌లో ఫిర్యాదులు, ఓటరు సమాచారం తెలుసుకునేందుకు మరిన్ని ఆప్షన్‌లు కనిపిస్తాయి. 'గూగుల్ ప్లే స్టోర్'లోనూ 'ఓటరు హెల్ప్‌లైన్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మరిన్ని సేవలు పొందవచ్చు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఓటర్లు సద్వినియోగం చేసుకోవచ్చు.

టోల్ ఫ్రీ మొత్తం ఫిర్యాదులు: 533
పరిష్కారం: 533 (100%) (ఈ నెల 6 వరకు)
(మతపరమైన ప్రసంగాలు, చెల్లింపు వార్తలు, ర్యాలీలకు ప్రజా రవాణా, నిషేధ కాలంలో ప్రచారంపైనా ఫిర్యాదు చేయొచ్చు)
విజిల్‌కు: ఫిర్యాదులు: 215
పరిష్కారం: 208
పెండింగ్‌లో: 7

ఫిర్యాదులపై తక్షణ స్పందన

ప్రియాంక అల, కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించాలి. అక్రమాలపై 'సి' విజిల్ యాప్ ద్వారా పౌరులు ఫిర్యాదు చేయొచ్చు. ఎవరైనా డబ్బు, మద్యం పంపిణీ చేస్తే.. ఆ ఫొటోలు, వీడియోలు తీసి యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

# కరోనాతో కమ్ముకున్న చీకట్లు..!



ఇల్లెందు : ఉన్నంతలో సంతోషంగా సాగుతున్న వారి జీవితాలు కొవిడ్ దెబ్బకు అతలాకుతలమయ్యాయి. వరుస కష్టాలు వారి జీవితాలను అగాధంలోకి నెట్టాయి. కుటుంబ పెద్ద బ్లాక్ ఫంగస్ బారినపడటంతో ఇంటికే పరిమితమయ్యారు. భర్త అనారోగ్యం బారినపడటంతో మనస్తాపానికి గురైన అతని భార్య కొద్ది నెలల క్రితం బలవన్మరణానికి పాల్పడింది. దీంతో వారి ముగ్గురు పిల్లల పోషణ భారంగా మారింది.

ఇల్లెందు మండలం మసివాగు పంచాయతీ ధర్మారం తండా గ్రామానికి చెందిన లకావత్ మోతీలాల్, అదే గ్రామానికి చెందిన రజిత ప్రేమించుకున్నారు. వారి ప్రేమకు రెండు వైపులా పెద్దలు ఆమోదం తెలిపారు. 2010లో వీరి వివాహమైంది. మోతీలాల్ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సాత్విక, రిష్విక, జష్విక. ఉన్న కొద్దిపాటి భూమిని దంపతులు సాగు చేసుకుంటూ జీవించేవారు. ఈ పరిస్థితుల్లో రెండేళ్ల క్రితం మోతీలాల్ కొవిడ్ బారినపడ్డారు. బ్లాక్‌ఫంగస్ లక్షణాలు రావడంతో ఖమ్మం, హైదరాబాద్‌లోని పలు వైద్యశాలల్లో చికిత్స తీసుకున్నారు. మెరుగైన చికిత్స కోసం రూ.8 లక్షల వరకు ఖర్చుచేసినా సమస్య పరిష్కారం కాలేదు. అతనికి ఒక చెవి పూర్తిగా వినపడదు. గొంతు సమస్యతో సరిగా మాట్లాడలేకపోతున్నాడు. నడవాలంటే కర్ర ఆధారంగా ఉండాల్సిందే. నేటికీ మందుల కోసం నెలకు రూ.6వేల ఖర్చు చేస్తూ మోతీలాల్ ఇంటిపట్టునే ఉంటున్నాడు.

మనస్తాపంతో భార్య..ఆరోగ్యంగా ఉండే భర్త అనారోగ్యం బారినపడటం.. ఆర్థిక సమస్యలు.. ముగ్గురు పిల్లల పోషణ భారం తనపై పడటంతో రజిత మనస్తాపానికి గురైంది. గత ఆగస్టు నెలలో క్షణికావేశంలో వ్యవసాయ భూమి వద్ద పురుగు మందు తాగింది. నిమ్స్‌లో పది రోజులపాటు మృత్యువుతో పోరాడి రజిత మరణించింది. దీంతో ముగ్గురు పిల్లలూ తల్లిలేని వారయ్యారు.

ఆసరా పింఛనూ లేదు..

ప్రస్తుతం మోతీలాల్ తల్లిదండ్రులు, అత్తమామలే చిన్నారుల పోషణ బాధ్యతలు చూస్తున్నారు. పెద్ద కుమార్తె సాత్విక సుదిమళ్లలోని రెసిడెన్షియల్‌లో ఏడో తరగతి, రిష్విక రొంపేడులోని ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. చిన్నారి జష్విక స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. మోతీలాల్‌కు 72శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ మంజూరైంది. ఆసరా పింఛనుకు దరఖాస్తు చేసుకున్నా ఇంకా రావటం లేదు. మెరుగైన వైద్యంతో తాను కోలుకునే అవకాశం ఉందని, కానీ చేయించుకునే స్థోమత లేదని మోతీలాల్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యానికి దాతలు, ప్రభుత్వం చేయూత అందించాలని కోరుతున్నారు. ఆసరా పింఛనుతోపాటు రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని వేడుకుంటున్నారు.

# ఎక్కువ ఓట్లుంటే.. అభ్యర్థులు మీవెంటే..!

పాల్వంచ : చింతకాని మండలం నాగులవంచలో కిలారు రామతులిశమ్మ కుటుంబంలో తొమ్మిది మంది ఓటర్లు ఉన్నారు. ఆమెతో పాటు ముగ్గురు కుమారులు, ముగ్గురు కోడళ్లు, ఇద్దరు మనుమరాళ్లు ఈసారి ఓటేయనున్నారు. ఈ కుటుంబం ఓట్లపై ప్రధాన పార్టీల నాయకులు దృష్టి సారించారు. ఇదే గ్రామంలో 16 కుటుంబాల్లో ఆరు కంటే ఎక్కువ ఓట్లు ఉండటంతో అభ్యర్థులు వారి ఓట్లపై గురి పెట్టారు. చింతకాని మండలం పందిళ్లపల్లికి చెందిన వత్సవాయి రాధమ్మ ఇంట్లో ఆరు ఓట్లు ఉన్నాయి. రాధమ్మతో పాటు ముగ్గురు కుమారులు, ఇద్దరు కోడళ్లు ఈసారి ఓటేయనున్నారు. అయిదు కన్నా ఎక్కువ ఓట్లు ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఆశావహులు వీరిని ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు.

చింతకాని, మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అభ్యర్థులు, ఆశావహులు ఇప్పటికే ఉమ్మడి, పెద్ద కుటుంబాల ఓట్లపై దృష్టి సారించారు. అయిదు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కుటుంబాలను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. గ్రామాల వారీగా జాబితాలు రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కుటుంబాలను మచ్చిక చేసుకుంటే గుంపగుత్తగా ఓట్లు పడతాయన్న భావనతో నేతలు ఉన్నారు.

12 వేలకు పైగా కుటుంబాలు..ఖమ్మం జిల్లాలో 589 గ్రామ పంచాయతీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 479 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పది నియోజకవర్గాల్లో 21,41,387 మందికి ఓటుహక్కు ఉంది. వీరి కోసం ఖమ్మం జిల్లాలో 1,455, భద్రాద్రి జిల్లాలో 1,095 పోలింగ్ కేంద్రాలను



ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. 5- 10 ఓట్లు కలిగిన ఉమ్మడి కుటుంబాలు ఒక్కో గ్రామంలో 10 నుంచి 15 ఉన్నట్లు ఇప్పటికే జాబితాలను ఆయా పార్టీల నాయకులు సిద్ధం చేశారు. ఈ లెక్కన ఉభయ జిల్లాల్లో 12వేలకు పైగా కుటుంబాల్లో అయిదు కంటే ఎక్కువ ఓట్లు ఉన్నట్లు సమాచారం. గతంలో ఒక కుటుంబానికి ఫ్రిజ్, టీవీ అందజేత

మధిర మండలంలోని ఓగ్రామంలో రెండు ఉమ్మడి కుటుంబాలున్నాయి. ఒక కుటుంబంలో 14, మరో కుటుంబంలో తొమ్మిది మంది ఓటుహక్కు కలిగి ఉన్నారు. ఆయా కుటుంబాలపై ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారిస్తాయి. గత పంచాయతీ ఎన్నికల్లో గెలుపోటములకు వీరి ఓట్లు అత్యంత కీలకమయ్యాయి. అందుకే ఓ కుటుంబానికి రిఫ్రిజిరేటర్‌ను ఓ రాజకీయ పార్టీ అందజేస్తే.. మరో పార్టీ టీవీ ఇవ్వటం గమనార్హం.

# వైద్య శాఖలో డిప్యూటేషన్ల రద్దు..

ఆదిలాబాద్ : జిల్లా వైద్యారోగ్య శాఖలో ఏళ్లుగా కొనసాగుతున్న డిప్యూటేషన్లను రద్దు చేయటం కలకలం సృష్టించింది. దశాబ్ద కాలంగా తమ పరపతిని ఉపయోగించి కొందరు, ఆయా ప్రాంతాలకు పరిపాలన సౌలభ్యం కోసం అధికారులు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఆ శాఖలోని వివిధ క్యాడర్ల సిబ్బందిని డిప్యూటేషన్‌పై వేశారు. కొన్ని నెలలు లేదా ఒక ఏడాది కాలపరిమితితో మాత్రమే డిప్యూటేషన్ పద్ధతిలో పని చేయాల్సి ఉండగా ఉద్యోగులు తమ పలుకుబడి, నాయకుల పైరవీలతో ఏళ్లుగా దర్జాగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాల్లో పదుల సంఖ్యలో ఉద్యోగులు ఈ విధానంలో పని చేస్తున్నట్లు సమాచారం. ఇలా డిప్యూటేషన్లపై పని చేస్తున్న వారు 25 మంది వరకు ఉంటారని గురువారం నాటికి వైద్య శాఖ ప్రాథమికంగా లెక్కలు తేల్చింది. డీహెచ్ (డైరెక్టర్ ఆఫ్ హెల్త్) డిప్యూటేషన్ ఉద్యోగులు దీనికి అదనం. జిల్లా స్థాయిలో ఇచ్చిన డిప్యూటేషన్లను ఆదిలాబాద్ డీఎంహెచ్ఓ రద్దు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేయటం, ఉద్యోగులు తమ పాత స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించటంతో వారిలో గుబులు మొదలైంది.

జిల్లాలో పరిపాలన సౌలభ్యం కోసం ఆయా ప్రాంతాల్లో అవసరం మేరకు కొందరిని డిప్యూటేషన్ విధుల్లో కేటాయించారు. మరికొంత మంది ఆరోగ్య కారణాల రీత్యా, కొందరు రాజకీయ, సొంత పలుకుబడితోనూ డిప్యూటేషన్లపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో కొనసాగుతున్నారు. వీరిలో పొరుగు సేవల ఉద్యోగులతోపాటు ఎన్‌హెచ్ఎం, రెగ్యులర్ ఉద్యోగులూ ఉన్నారు. వీరిలో కొందరు తమ వ్యాపారాల కోసం, ఇతరత్రా డిప్యూటేషన్ల పలుకుబడితో చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు ఉద్యోగులు 15 ఏళ్లుగా డిప్యూటేషన్‌పైనే విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఎవరు, ఎక్కడ డిప్యూటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారో అధికారులకు తెలియని పరిస్థితి నెలకొంది. డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్ ఇటీవల ఈ డిప్యూటేషన్లు రద్దు చేయటంతో 25 మంది ఉద్యోగులు ఇలా పని చేస్తున్నట్లు తేలింది. వీరందరూ తమ పాత స్థానాల్లో చేరాలని ఆదేశించారు.

వ్యవహారం తెరకెక్కింది ఇలా..

ఆదిలాబాద్ నుంచి డిప్యూటేషన్‌పై మంచిర్యాల జిల్లాలో డీఈఓ(డాటా ఎంట్రీ ఆపరేటర్)గా పని చేస్తున్న ఉద్యోగి జులైలో అవినీతి నిరోధక శాఖ(అనిశా) వలకు చిక్కాడు. అతడిని అనిశా అధికారులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించే సమయంలో విధుల నుంచి తొలగించాల్సి ఉంది. విధుల నుంచి తొలగించాలంటూ ఆ శాఖాధికారులు మంచిర్యాల వైద్య శాఖకు సమాచారం ఇవ్వగా.. అతడు డిప్యూటేషన్‌పై ఆదిలాబాద్ నుంచి వచ్చి పని చేస్తున్నట్లు వెలుగు చూసింది. దీంతో విధుల నుంచి తప్పించే అధికారం తమకు లేదని ఆదిలాబాద్ అధికారులు సస్పెండ్ చేయాల్సి ఉంటుందని సమాచారం ఇచ్చారు. ఈ వ్యవహారం రాష్ట్రస్థాయి అధికారులకు చేరింది. దీంతో ఇలా పని చేస్తున్న ఉద్యోగుల డిప్యూటేషన్లను రద్దు చేయాలంటూ ఆదిలాబాద్ అధికారులకు రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో డీఎంహెచ్ఓ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

అవసరమైన చోటుకే ఇస్తాం..

రాథోడ్ నరేందర్, డీఎంహెచ్ఓ

జిల్లాలో ఎంత మంది డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారో ఇప్పటి వరకు వివరాలు అందుబాటులోకి రాలేదు. చాలా కాలంగా కొందరు ఇలా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో ఇచ్చిన డిప్యూటేషన్లను రద్దు చేసి.. వారు పాత స్థానాల్లో చేరాలని ఆదేశించాం. ప్రస్తుతం అవసరాన్ని బట్టి ఎక్కడ సిబ్బంది తక్కువగా ఉంటారో అక్కడే పలుకుబడి, పైరవీలకు తావు లేకుండా డిప్యూటేషన్లు ఇస్తాం.

# అతివలే అధికం.. కేటాయింపు స్వల్పం

ఆసిఫాబాద్: ఈ శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి మహిళల ఓట్లే కీలకంగా మారనున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని దాదాపు అన్ని నియోజక వర్గాల్లో పురుషుల కంటే అతివలే అధికంగా ఉన్నారు. గెలుపోటములు నిర్ణయించాల్సింది వారే అయినా.. ఎన్నికల్లో వారికి టికెట్ల కేటాయింపులో ఏ పార్టీ సముచిత స్థానం కల్పించలేదు. ప్రస్తుతం అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలోని 10 నియోజకవర్గాల్లో కేవలం ఇద్దరికి మాత్రమే ఆయా పార్టీలు టికెట్లు ఇచ్చాయి. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్లను అన్నిపార్టీలు ఆమోదించినా మహిళా సాధికారత, అవకాశాల్లో మాత్రం వెనకడుగు వేస్తున్నాయి.

ఆసిఫాబాద్ నియోజవకర్గం భారాస అభ్యర్థిగా కోవ లక్ష్మి, బెల్లంపల్లి భాజపా నుంచి శ్రీదేవి మాత్రమే ఈసారి శాసనసభ బరిలో ఉన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ భారాస(తెరాస) నుంచి కోవ లక్ష్మి, మంచిర్యాల నుంచి స్వతంత్ర అభ్యర్థి చల్లగుల్ల విజయశ్రీ, ఖానాపూర్ నుంచి భారాస(తెరాస) అజ్మీరా రేఖానాయక్, ఎన్పీఆర్‌పీ



నుంచి కుర్సెంగ అనిత బరిలో నిలిచారు. ఆదిలాబాద్ కాంగ్రెస్‌స్థానం నుంచి గండ్రత్ సుజాత, నిర్మల్ భాజపా నుంచి స్వర్ణారెడ్డి, ముథోల్ బీఎస్పీ నుంచి రాథోడ్ సుజాతలు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి గత ఎన్నికల్లో నలుగురు మహిళలకు 8పోటీ చేసే అవకాశం రాగా, ప్రస్తుత ఎన్నికల్లో ఇద్దరికే వచ్చింది.

ఉమ్మడి జిల్లా పరిధిలోని పది నియోజకవర్గాల్లో పురుషులతో పోల్చితే ఆసిఫాబాద్(888), చెన్నూరు(172), మంచిర్యాల(421) ఆదిలాబాద్(4073), బోథ్(5375), ఖానాపూర్(3682), నిర్మల్(12 151), ముథోల్(6192) మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10,93,581 పురుష ఓటర్లు ఉండగా, 11,25,656 మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కన్నా 32,075 ఓట్లు మహిళలవి అధికంగా ఉన్నాయి. పది నియోజకవర్గాల్లో 8 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండగా, మరో రెండు నియోజకవర్గాల్లో మహిళలు, పురుషుల ఓటర్ల మధ్య తేడా అతి స్వల్పంగా ఉంది. అప్పుడు 21.. ఇప్పుడు 18

స్వాతంత్ర్య భారతదేశంలో మొదట ఓటు వేయడానికి కనీస వయసు 21గా ఉండేది. 1988లో 61వ రాజ్యాంగ సవరణ చేసి దానిని 18 ఏళ్లకు తగ్గించారు. ప్రస్తుతం వరకు అదే కొనసాగుతోంది.

# నాలాల పూడికతీత మొదలు

వరంగల్ : నాలాల పూడికతీత పనులకు యంత్రాలు కదిలాయి. ఇంజినీర్లు క్షేత్రస్థాయికి వెళ్లారు. పర్సంటేజీలు తేల్చండి' కథనంపై ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి స్పందించి ఇంజినీర్లపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో క్షేత్రస్థాయికి వెళ్లారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో పూడికతీత పనులు దగ్గరుండి చేయించారు. వరంగల్ ప్రాంతంలో ఎస్సార్‌నగర్, మొగిలిచర్ల, అబ్బనికుంట, పోతననగర్, బొందివాగు, హనుమకొండలో వడ్డేపల్లి మంగళివాగు, రాంనగర్, నయీంనగర్, కాజీపేట దర్గా, రామకృష్ణ కాలనీల్లో నాలాల పూడికతీత పనులు జరిగాయి. బల్దియా ఎస్ఈ కృష్ణారావు, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్ రావు, డీఈలు సంతోష్‌బాబు, రవికుమార్, రవికిరణ్, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనులు పర్యవేక్షించారు. 33 నాలాల పూడికతీత పనులు పారదర్శకంగా జరగాలని, కొత్తగా రూపొందించిన యాప్ రెండు,



మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తుందని ఎస్ఈ కృష్ణారావు ఇంజినీర్లకు తెలిపారు. గంటకు వాహనాల పనితీరు, ఎన్ని క్యూబిక్ మీటర్లు పూడిక తీశారో వెంట వెంటనే యాప్‌లో నమోదు చేయాలన్నారు.

నిఘా వర్గాల ఆరా

33 నాలాలు, రూ.2.32 కోట్ల నిధులతో పూడికతీత పనులు ఎలా జరుగుతున్నాయి? పర్సంటేజీలు అడుగుతున్న కార్పొరేటర్లు, పాలకవర్గం పెద్దలు ఎవరెవరు ఉన్నారంటూ నిఘా వర్గాలు ప్రచురితమైన కథనంపై ఆరా తీశారు. కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాల వారీగా నాలాల వివరాలు, నిధులు, గుత్తేదార్ల పేర్లు సేకరించారని తెలిసింది. పూడికతీత ప్రతిపాదనల పెంపుపై విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటు శాఖాధికారులు కూడా ఆరా తీస్తున్నారు.

# పెద్దన్న కష్టాల నుంచి నేర్వాలి పాఠాలు!

మహబూబాబాద్ : ఉమ్మడి జిల్లాలో వరంగల్‌లో మహానగరపాలక సంస్థ కాకుండా మరో తొమ్మిది పురపాలక సంఘాలు ఉన్నాయి.
వర్ధన్నపేట, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు కొత్తగా ఏర్పడ్డవి.
జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల పాతవి.
పెద్దవాళ్ల నుంచి మనం అనేక పాఠాలు నేర్చుకుంటాం. పట్టణాల విషయంలో ఇలా జరగడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పట్టణాలకు పెద్దన్నలాంటిది వరంగల్ మహానగరం. పది లక్షల జనాభా దాటిన ఈ నగరం ప్రణాళిక లేకుండా విస్తరించడంతో వర్షాకాలంలో ప్రజలు అనేక రకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. నాలాలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు జలమయమవుతున్నాయి. కాలనీలు నీట మునుగుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు తాత్కాలిక హడావుడి చర్యలు చేపట్టడం.. తర్వాత వదిలేయడం.. ఓరుగల్లులో జరిగిన పొరపాట్లే చిన్న పట్టణాల్లో పునరావృతం కాకుండా నేర్వాల్సిన పాఠాలు, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.ఏదీ 'చెత్త'శుద్ధి?

వరంగల్ నగరంలోని చెత్తనంతా మడికొండ డంపింగ్ యార్డులో వేయడంతో అది పేరుకుపోయి పెద్ద సమస్యగా మారింది. మరోవైపు వర్షాకాలంలో మురుగునీరంతా మడికొండలోని చెరువుల్లోకి ప్రవహిస్తోంది. ఫలితంగా స్థానిక ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. చెత్తశుద్ధికి బయోమైనింగ్ మొదలుపెట్టి నిలిపేశారు.

కొత్తగా ఏర్పడిన వర్ధన్నపేటలో సైతం ఇంటింటి చెత్త సేకరణ, దాన్ని పోసేందుకు డంపింగ్ యార్డు సరిగా లేదు. ఆకేరు వాగులోనే చెత్తను పోస్తుండడంతో అది కలుషితమవుతోంది.

ఇలా చేద్దాం: అనేక పట్టణాల్లో డంపింగ్ యార్డులు లేవు. వీటిని రాబోయే పదేళ్లను దృష్టిలో పెట్టుకుని వీటిని ప్రణాళిక ప్రకారం నిర్మించాలి.

పారిశుద్ధ్యం పట్టదా?

వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షం నీరు రహదారులపై ప్రవహిస్తుంది. వరద నీటి కాలువలు సరిగా లేవు. ఇప్పుడు కొత్త పురపాలికల్లో సైతం రహదారుల పక్కన నాలాలు సరిగా లేక పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

నర్సంపేట మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ నిర్మాణం కాకపోవడంతో మురుగునీరంతా రహదారులపై ప్రవహిస్తోంది. నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఉన్నతీకరణ జరిగినా పట్టణంలో అంతర్గత రహదారులు సరిగా లేవు.

ట్రీట్మెంట్ ప్లాంట్లు కరవుఓరుగల్లులో మురుగునీరు బంధం చెరువు, కోట చెరువు, నాగారం, చిన్నవడ్డేపల్లి చెరువుల్లో కలుస్తోంది. ఈ మహానగరానికి ట్రీట్మెంట్ ప్లాంట్లు లేవు.

ఇదే తరహాలో జనగామ పట్టణం మురుగునీరంతా నెల్లుట్ల చెరువులోకి ప్రవహిస్తోంది.ఇలా చేద్దాం: ప్రతి నగరం, పట్టణంలో మురుగునీటికి ప్రత్యేక ప్రణాళిక ఉండాలి. ఎక్కడా ఇవి కానరావడం లేదు. అన్ని పట్టణాల్లో ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తే వానాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారు.

నాలాలు బాగుచేయాలి

వరంగల్ నగరంలో దశాబ్ద కాలంగా నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. వర్షాకాలం వరద నీరు నాలాల్లోకి వెళ్లకుండా కాలనీలను ముంచెత్తుతున్నాయి. రెండేళ్ల కిందట వీటిని విస్తరించేందుకు అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రారంభించారు. అది ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇదే తరహాలో అనేక పట్టణాల్లోనూ నాలాలు ఆక్రమణకు గురవుతున్నా పాలక వర్గాలు, అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయి.

భూపాలపల్లి పట్టణంలోని కారల్‌మార్క్స్ కాలనీలో ఇప్పటికే కొన్ని నాలాలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలైన కారల్‌మార్క్స్ కాలనీ, రాజీవ్‌నగర్, జవహర్‌నగర్‌లో ఇళ్లు నీట మునుగుతున్నాయి.ఇలా చేయాలి: ఆక్రమణలను గుర్తించి నాలాలను విస్తరిస్తే ఈ సమస్య ఉండదు. నాలాల్లో పూడికతీత చేపట్టాలి.

బృహత్ ప్రణాళికల్లేవ్.. పది లక్షల జనాభా ఉన్న వరంగల్‌లో ఇప్పటికీ కొత్త బృహత్ ప్రణాళికకు ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. ఉమ్మడి జిల్లాలో పాత పురపాలక సంఘాల్లో తాతల నాటి ప్రణాళికే అమలవుతోంది. కొత్త పట్టణాల ప్రణాళిక ప్రతిపాదనల దశలోనే ఉంది.ఇలా చేద్దాం: ప్రణాళిక లేకుండా జరిగే అభివృద్ధి వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు ఎదువుతాయి. పట్టణాలు సమగ్ర అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ తప్పకుండా ఉండాల్సిందే.

ఇంకా అనేక సమస్యలుచినుకుపడిందంటే వరంగల్‌లో తాగునీటి పైపులైన్లు లీకేజీ అయ్యి తాగునీరు కలుషితం అవుతోంది. ఇదే తరహాలో డోర్నకల్‌లో అనేక లీకేజీలు ఉన్నాయి పరకాల బీసీ కాలనీ, శ్రీనివాస కాలనీలు లోతట్టు ప్రాంతాలు. ఈ సమస్య పరిష్కరించాలంటే వరద బయటకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలి. మరిపెడలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. చినుకు కురిస్తే గాంధీ బజార్, గ్యామా తండా, లోక్య తండా తదితర కాలనీలు నీట మునుగుతున్నాయి.

# అత్యాశకు పోవద్దు.. ఆగం కావద్దు



వైరా : సత్తుపల్లి వాసి పాటిబండ్ల ప్రశాంత్, దమ్మపేటకు చెందిన మృదులకు 14ఏళ్ల క్రితం వివాహమైంది. అనంతరం అమెరికాలో స్థిరపడ్డారు. కొన్నేళ్లకు హైదరాబాద్‌కు మకాం మార్చారు. వీరికి ఇద్దరు కుమారులు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, బెట్టింగులతో ప్రశాంత్ నష్టాల ఊబిలో చిక్కుకుపోయారు. భార్యకు కట్నంగా వచ్చిన ఏడున్నర ఎకరాల భూమిని విక్రయించాలని ఒత్తిడి తీసుకొచ్చారు. తల్లిదండ్రులకు చెప్పుకోలేక, భర్తను మార్చుకోలేక ఇద్దరు కుమారులతో కలిసి మృదుల ఇటీవల బలవన్మరణానికి పాల్పడ్డారు.

క్రికెట్ బెట్టింగ్‌లో రూ.లక్షల్లో పోగొట్టుకున్నాడు వైరాకు చెందిన ఓ వ్యక్తి. తన భార్యకు ఉన్న రూ.7 లక్షల బంగారు ఆభరణాలను దొంగచాటుగా విక్రయించాడు. ఇదేమిటని నిలదీస్తే ముఖం చాటేశాడు. భర్త బెట్టింగ్‌ల గురించి పుట్టింట చెప్పుకోలేక సదరు మహిళ బలవన్మరణానికి యత్నించింది. పుట్టింటివారు చేరదీశారు.

అత్యున్నత స్థాయికి చేరుకునేందుకు అవసరమైన ఆర్థిక పునాదులు రాత్రికిరాత్రే దరిచేరాలనే అత్యాశతో వేసే తప్పటడుగులు ఆలుమగల మధ్య చిచ్చుపెడుతున్నాయి. అవగాహన లేని వ్యాపారాలు, బానిసలుగా మార్చే బెట్టింగులు, ఇతర దురలవాట్లతో కష్టాల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడు మాత్రమే అత్తారింటి నుంచి వచ్చిన కట్నకానుకలను అమ్మేసి బయటపడాలనే ఆకాంక్ష ఇటీవల పెచ్చుమీరుతోంది. ఆనందంగా ఉండాల్సిన దాంపత్య జీవితాలు ఆస్తిపాస్తుల విషయంలో ఛిద్రమవుతున్నాయి.

హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసే క్రమంలో ఏదో ఒకరూపంలో ఆస్తిని కట్నంగా ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అత్తారింటికి పంపే క్రమంలో అమ్మాయికి తమ అండదండలతో పాటు ఆస్తిపాస్తులున్నాయనే సానుకూల వాతావరణం కల్పిస్తున్నారు. వీటిని ఆసరాగా చేసుకుని అనేక కుటుంబాలు ఉన్నతస్థాయికి ఎదిగాయి. అదే కట్నకానుకలకు అర్రులు చాస్తూ వాటిని విక్రయించాలనే పట్టుదలను ప్రదర్శించే భర్తల వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఓర్పు, నేర్పు అవసరం

నష్టాల ఊబిలో చిక్కుకున్నప్పుడు కట్నం తాలూకు ఆస్తిపాస్తులను అమ్మాలనే ఆలోచన రావొచ్చు. అయితే వాటిని విక్రయించే సమయంలో అత్తారింటి ఒత్తిళ్లు, పిల్లల భవిష్యత్తునూ పరిగణనలోకి తీసుకోవాలి. ఇలాంటి క్లిష్టపరిస్థితుల నుంచి సున్నితంగా బయటపడేందుకు ఓర్పు, నేర్పు కావాలి. అత్తారింటి అండదండలతో సమస్యను అధిగమించేందుకు యత్నించాలి. అలా కాకుండా భార్యాభర్తల్లో ఎవరు క్షణికావేశానికి లోనైనా కుటుంబ గమనం గాడితప్పుతుంది.

పరిస్థితులకు తగ్గట్టు అడుగులెయ్యాలి..

ఎంతటి వారైనా తమస్థాయికి అనుగుణంగా నడుచుకోవాల్సిందే. ఒక్కరాత్రిలోనే ధనవంతులమైపోవాలనే దురాశ తగదు. ఐపీఎల్ ప్రారంభమయ్యాక ఎంతోమంది బెట్టింగ్‌ల బాట పడుతున్నారు. కుటుంబ పోషణ, పిల్లల భవిష్యత్తు, చదువుల వంటి అంశాలను మదిలో ఉంచుకుంటేనే క్రమశిక్షణతో మెలిగే ఆస్కారముంది. ఇదే సమయంలో వివాహితులు సైతం తీవ్ర మానసిక సంఘర్షణకు గురికాకుండా సమస్య నుంచి బయటపడే మార్గాలను అన్వేషించాలి. ఇంటాబయటా అండగా నిలిచే బంధువులు, స్నేహితుల నుంచి సానుకూల ఆలోచనలను స్వీకరిస్తూ ముందుకు సాగాలి. అభం శుభం తెలియని చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలే కానీ వారిని చిదిమేయకూడదు.

సమస్య లేనివారెవరూ ఉండరు. మానసిక స్థైర్యం పెంచుకోవాలి. క్లిష్టపరిస్థితుల్లో ముఖ్యంగా వివాహితులు ధైర్యాన్ని ప్రదర్శించాలి. తాత్కాలిక సమస్యకు నిండు జీవితాలను బలిచేసుకోవద్దు. పరిష్కారాన్ని అన్వేషించే క్రమంలో సన్నిహితులు, కుటుంబ సభ్యుల సహకారం తీసుకోవాలి.'వీరేందర్ చిట్టె, ఎండీ(మానసిక వైద్యనిపుణుడు)

# వదలని వసూళ్ల రోగం



ఖమ్మం: దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు తయారైంది ఖమ్మం జిల్లా సర్వజనాసుపత్రిలోని కొంతమంది అధికారులు, సిబ్బంది తీరు. నిరుపేదల వైద్యానికి భరోసా కల్పిస్తుందని ప్రశంసలు అందుకుంటున్న ఆసుపత్రిపై.. అదేస్థాయిలో వెలుగుచూస్తున్న అవకతవకలు, అవినీతి మరకలు మాయనిమచ్చగా మారుతున్నాయి. ఒప్పంద కార్మికులు, ఫార్మాసిస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగిన వైనం మరువకముందే.. కొత్తగా చేపట్టిన నియామకాల్లోనూ ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ పేరిట కాలయాపన

గతంలోనూ అవకతవకలతో ఆసుపత్రి ప్రతిష్ఠ మసకబారినా విచారణ పేరిట కాలయాపన చేయడమే తప్పితే చర్యలు తీసుకోలేదు. ఏటికేడు అత్యాధునిక వసతులు, హంగులతో అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తుంటే.. ఇదే అదనుగా ఆసుపత్రిలో కొంతమంది అధికారులు, సిబ్బంది తెరలేపిన వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట పడటం లేదు. ప్రధానంగా పారిశుద్ధ్యం, భద్రత, పేషెంట్ కేర్ విభాగాల్లో నియామకాలకు ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు- 3 లక్షలు దండుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 150 మంది వద్ద సుమారు రూ.కోటికిపైనే వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తగా.. ఇటీవల చేపట్టిన మరో 150 మంది నియామకాల్లోనూ అదేతంతు పునరావృతమైందని సమాచారం.

వేతనాల్లోనూ కోతలే..

ముడుపులు చెల్లించి సర్వజనాసుపత్రిలో ఉద్యోగాలు పొందిన ఒప్పంద సిబ్బంది పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. విధుల్లో చేరే సమయంలో నెలకు రూ.12వేల జీతం ఇస్తామని చెప్పి ఆ తర్వాత రూ.11వేలే అందిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. ఏజెన్సీని గుప్పిట్లో పెట్టుకుని సిబ్బంది వేతనాల్లో అడ్డగోలుగా కోత విధిస్తున్నట్లు తెలిసింది.

ఆసుపత్రిలో పనిచేసేందుకు 50-70 మంది అవసరమైతే.. ఏకంగా 150 మందిని నియమించి 70 మంది జీతాలనే అందరికీ పంచుతున్నారని సమాచారం. అంతేకాదు.. ఆసుపత్రిలో పనిచేసే దాదాపు 50 మంది ఒప్పంద కార్మికులకు దక్కాల్సిన రూ.కోటి పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును సైతం మాయం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యాంటీన్ నిర్వహణలోనూ పైరవీలకే పెద్దపీట వేస్తున్నారన్న చర్చ సాగుతోంది.

నూతన విభాగాల్లో పరికరాలు, యంత్రాల కొనుగోళ్లలోనూ అవకతవకలు జరిగినట్లు సమాచారం. ధర్మాసుపత్రిలో అవినీతి పర్వంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తినా.. ఈ వ్యవహారంపై విచారణ సాగినా ఏమీ తేల్చకపోవటం విమర్శలకు తావిస్తోంది.

ఉన్నట్టుండి విధుల నుంచి తొలగింపు..

ఒప్పంద ప్రాతిపదికన పారిశుద్ధ్య సిబ్బంది నుంచి రూ.2 లక్షలు, పేషెంట్ కేర్, భద్రత సిబ్బంది నుంచి రూ.3 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించడంతో ఇక తమ విధులకు ఇబ్బందులు లేవని సిబ్బంది నిబ్బరంతో ఉంటే.. కొంతమందిని ఉన్నట్టుండి విధుల నుంచి తొలగించటం గమనార్హం. ఉద్యోగం కోసం తాము చెల్లించిన మొత్తం ఎవరిస్తారని ప్రదక్షిణలు చేస్తుండటంతో ఆసుపత్రిలో వసూళ్ల బాగోతం మరోసారి చర్చనీయాంశమైంది. ఈ తతంగమంతా ఆసుపత్రిలో కీలకంగా వ్యవహరించే కొంతమంది అధికారుల కనుసన్నల్లో జరిగిందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.ఆసుపత్రిలో సిబ్బంది నియామకాల పేరిట వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించం. గతంలో కొన్ని ఆరోపణలు ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాను. అన్యాయం జరిగిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. డాక్టర్ రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, ఖమ్మం ప్రభుత్వ వైద్యకళాశాల

# కొత్త గనులపైనే సింగరేణి ఆశ

కొత్తగూడెం : ఈ ఉత్పత్తి సంవత్సరం ఉత్పత్తి మొదలవుతుందని అంచనా వేస్తున్న కొత్త గనులపై సింగరేణి కొండంత ఆశలే పెట్టుకొంది. సింగరేణి వ్యాప్తంగా నాలుగు పెద్ద గనులు ప్రారంభించనున్నారు. వాటి అనుమతులు, ఇతర ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఎదురయ్యే ఆటంకాలు సత్వరమే పరిష్కరించాల్సిందిగా ఎప్పటికప్పుడు అధికారులతో యాజమాన్యం సమీక్షలు నిర్వహిస్తోంది. ఈ ఉత్పత్తి సంవత్సరంలోనే కొత్త గనుల్లోంచి సుమారు 100 లక్షల టన్నుల బొగ్గు వెలికితీయాలని స్పష్టం చేస్తోంది. వచ్చే ఉత్పత్తి సంవత్సరం (2024-25) ఇది 200 లక్షల టన్నులకు పెరగాలన్నది ప్రణాళిక. కొత్త గనుల్లో రెండు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనివే కావడం విశేషం.

తాజా పురోగతి ఇలా..

నైనీ కోల్‌బ్లాకుకు అన్ని అనుమతులు లభించాయి. గని ప్రారంభించాల్సిన ప్రాంతంలో చెట్లను తొలగించే పనులు చేపట్టాల్సి ఉంది. నెలల్లో ఉత్పత్తి చేపట్టాలన్నది యాజమాన్యం లక్ష్యం.కొత్తగూడెం ఏరియాలోని జీకే ఓసీ, వీకే-7 భూగర్భగనుల విస్తరణతో వీకే ఓసీ ఏర్పాటుకానుంది. అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా అప్పగించాల్సిన భూమి విషయంలో



కొంత జాప్యం జరుగుతోంది. త్వరలో సమస్యను అధిగమించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని గోలేటి పాత భూగర్భగనిని ఓసీగా విస్తరించనున్నారు. కొన్ని అనుమతులు వస్తే వేగంగా ఉత్పత్తి ప్రారంభించే పనిలో స్థానిక అధికారులు నిమగ్నమయ్యారు.ఇల్లెందులోని 21 ఇంక్లైన్, జీకే-5 భూగర్భగనులపై విస్తరించనున్నదే జీకే ఓసీ. ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. పర్యావరణ అనుమతులొస్తే ఉత్పత్తికి మార్గం సుగమం అయినట్లే.

# జల వ్యాపారం.. జనాలకు ప్రాణసంకటం!

పాలకుర్తి : జిల్లాలో నీటి వ్యాపారం విశృంఖలత్వానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అనుమతులు లేకుండా ఆర్వో ప్లాంట్లను విచ్చలవిడిగా ఏర్పాటు చేసి వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నాణ్యత ప్రమాణాలు లేని జలాలను తాగునీటిగా విక్రయిస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక గ్రామాల్లో సైతం ఈ వ్యాపారం విరివిగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు, ప్రమాణాలు లేకుండా నీటి కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

నిర్వాహకుల ఇష్టారాజ్యం

జనగామ పట్టణంతో పాటు పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రాల్లో నీటి శుద్ధి ప్లాంట్లను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారు. తాగునీటికి సైతం ఈ నీటినే వినియోగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 200 వరకు ఆర్వో ప్లాంట్లు ఉండగా వీటిలో అన్ని రకాల అనుమతులు పొందినవి కేవలం వందలోపే ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్వో ప్లాంట్ల కోసం విరివిగా బోర్లను వేయడంతో భూగర్భ జలాలకు ముప్పు వాటిల్లుతోంది. వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే ఆర్వో ప్లాంట్లను ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎండాకాలంలో అయితే కొన్ని చోట్ల మున్సిపల్, ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని తీసుకొని ఈ నీటినే డబ్బాలో పోసి అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రూ.లక్షల్లో వ్యాపారం

ఎక్కడైనా బోరు వేస్తే నీళ్లు బాగా పడితే చాలు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేసి ఆర్వో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం



పరిపాటిగా మారింది. ఇందులో ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారో అందులో పని చేసే వారికే తెలియదు. వాస్తవంగా ఐ.ఎస్.ఐ అనుమతులతో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకుంటే రూ.18లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ధ్రువీకరణ పత్రం ఆధారంగా ప్లాంట్ ఏర్పాటు చేసిన తర్వాత ప్రతి 3మాసాలకు ఒకసారి ఉన్నతస్థాయి అధికారులు తనిఖీలు చేసి పరిశీలిస్తారు.ప్రస్తుతం ఎలాంటి నిబంధనలు లేకుండా ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయి.డబ్బా తాగునీటిని రూ.10, ఇళ్లకు రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. జిల్లాలో నెలకు సుమారుగా రూ.25లక్షల వ్యాపారం సాగుతోందని తెలుస్తోంది.

కాగితాలకే పరిమితమైనా నిబంధనలు

నీటిలో సాయిల్, ఐరన్, యాసిడ్, కోర్లిన్, క్లోరైడ్ వంటి ఆమ్లాలు ఉంటాయి. ఇవి అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో ఉంటే ప్రజారోగ్యానికి ముప్పు. అందుకే ప్లాంటులో కెమికల్ అనాలిసిస్ ల్యాబ్ ఏర్పాటు చేసి కెమిస్టు, మైక్రో బయాలజిస్టులను నియమించుకోవాలి. వీరు ఫిల్టర్ చేసే ముందు నీటిని పరీక్షించాలి. ఫిల్టర్ అయ్యాక నీటి నాణ్యత పరీక్షలు జరిపి తదనంతరం నీటిని అందించాలి. కానీ ఈ నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా విక్రయిస్తున్న తాగునీటి కారణంగా ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతోందని, కాల్షియం కోల్పోయి మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

నిబంధనలు పక్కాగా పాటించాలి

-మధుమోహన్, ఆర్డీవో, జనగామ

ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి. తర్వలోనే నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయిస్తా. ఇతర శాఖలతో కలిసి తరచూ తనిఖీలు జరిపేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. నిబంధనలు పాటించని, అక్రమంగా నెలకొల్పిన ప్లాంట్లపై చర్యలు తీసుకొని మూసివేస్తాం.

# వేసవిలో పైపైకి భూగర్భజలం

కరీంనగర్ : వేసవికాలంలో అడుగంటాల్సిన భూగర్భ జలాలు పైపైకి చేరాయి. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వ్యవసాయానికి వరప్రదాయనిగా ఉంటుండగా అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో జలాలు వృద్ధి చెందాయి. ఎస్సారెస్పీ కాకతీయ కాలువలతో హుజూరాబాద్, మానకొండూర్, తిమ్మాపూర్, చొప్పదండి, వీణవంక, కేశవపట్నం మండలాల్లో సాగు నీరు అందుతుండగా వ్యవసాయ బావులు, బోరుబావులు రైతులకు అండగా నిలిచాయి. ఇక గంగాధర, రామడుగు మండలాలకు ఎల్లంపల్లి, కాళేశ్వరం జలాలతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి.

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2,20,286 ఎకరాలు కాగా యాసంగిలో ఏకంగా 2,92,880 ఎకరాల్లో అన్ని రకాల పంటలు వేశారు. ఇందులో వరి పంటనే 2,71,388 ఎకరాల్లో వేశారు. అకాల వర్షాలు, వడగళ్ల



వానలతో జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాదిలో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. ఆయకట్టు ప్రాంతాలకు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీరు సరఫరా కావడంతో పంటల సాగులో రైతులకు ఇబ్బందులు తీరాయి. ఒకప్పుడు కరవు కాటకాలతో ఇబ్బందులు పడ్డ గంగాధర మండలంలో 7.22 మీటర్ల లోతులో నీరుంది. మానకొండూర్ మండలంలో తక్కువ లోతులో ఉండగా, చొప్పదండి మండలంలో ఎక్కువ లోతులో ఉన్నాయి. గతేడాది జిల్లాలోని అన్ని మండలాల్లో సాధారణంగా 8.16 మీటర్ల లోతులో నీళ్లుండగా ఈసారి 7.64 మీటర్ల లోతులో ఉన్నాయి. గతేడాది కంటే ఈసారి భూగర్భ జలాలు పైకి చేరడంతో వచ్చే వానాకాలంలో ఖరీఫ్ పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులుండవని రైతులు గంపెడాశతో ఉన్నారు.పంటల సాగుకు ఇబ్బంది లేదు

జిల్లాలో నీటి వనరులు ఉండడంతో వచ్చే ఖరీఫ్‌లో సాగునీటికి ఎలాంటి ఇబ్బందుల్లేవు. ఆరుతడి పంటలు సాగు చేసిన మండలాల్లో వినియోగం తగ్గి భూగర్భ జలాలు అందుబాటులో ఉండగా, వరి సాగు చేసిన మండలాల్లో మాత్రమే ఎక్కువ లోతులో నీరుంది. మొత్తంగా చూస్తే గతేడాది కంటే ఈసారి భూగర్భ జలాలు వేసవిలో పైకి చేరాయి.

# ప్రతీ ఒక్క వైసీపీ సైకోను అవే చెప్పులతో తరిమి కొడతాం!



అమరావతి: కొలిమిగుండ్లలో తెలుగు యువత అధికార ప్రతినిధి మంద విజయ్‌గోపాల్‌పై వైసీపీ నేతల దాడిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తీవ్రంగా ఖండించారు. దాడిపై ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "తెలుగు యువత అధికార ప్రతినిధి మంద విజయ్‌గోపాల్‌పై వైసీపీ సైకోల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను.

మా విజయ్ గోపాల్‌ను చెప్పులతో కొట్టిన ప్రతి ఒక్క వైసీపీ సైకోని అవే చెప్పులతో ప్రజలు తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. పాలక పార్టీ ఫ్యాక్షనిస్టుల కంటే ఘోరంగా దాడులు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? బాధితులపై రివర్స్ కేసులు బనాయించడం సిగ్గుచేటు" అంటూ లోకేష్ విరుచుకుపడ్డారు.

# ఎస్సీ వర్గీకరణపై జగన్ రెడ్డి నోరుమెదపడం లేదు ఎందుకు? జవహర్ సూటి ప్రశ్న



అమరావతి: ఎస్సీ వర్గీకరణపై సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపడంలేదని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత కేఎస్ జవహర్ సూటిగా ప్రశ్నించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఎస్సీ వర్గీకరణకు జగన్ రెడ్డి పూర్తి వ్యతిరేకం. వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చినా ఎందుకు దానిపై జగన్ రెడ్డి స్పందించడం లేదు? దళితుల చిరకాల వాంఛ అయిన వర్గీకరణకు జగన్ అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఈ అంశంపై నాలుగున్నరేళ్లలో ఒక్కరోజు కూడా స్పందించలేదు. సామాజిక న్యాయం టీడీపీ తోనే సాధ్యం అవుతుంది. మాదిగ, మాల, రెల్లి కార్పొరేషన్ కు ఒక్క రూపాయి కూడా జగన్ ప్రభుత్వం కేటాయించలేదు. వచ్చే ఎన్నికల్లో జగన్ కు బుద్ధి చెప్పేందుకు ఎస్సీలు సిద్ధమయ్యారు" అని అన్నారు.

# మట్టి అక్రమరవాణాపై దేవినేని ఆగ్రహం

ఎన్టీఆర్ జిల్లా: జిల్లాలో మట్టి అక్రమ రవాణాపై మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని మైలవరం పోలీస్‌స్టేషన్‌లో నాయకులతో కలిసి దేవినేని ఉమా ఫిర్యాదు చేశారు. పుల్లూరు గ్రామంలో రెండు రోజుల క్రితం గ్రామస్థులు మట్టి లారీలను పట్టించినా పోలీసులు వదిలి వేయడంపై దేవినేని అసంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులతో కలిసి అక్రమంగా మట్టిని అమ్ముకునే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అనుచరులు చేస్తున్న అక్రమ దందాలకు పోలీసులు కొమ్ము కాస్తున్నారంటూ ఆరోపించారు. మైలవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే, అనుచరులు చేస్తున్న అక్రమ దందాలను రోజుకు ఒకటి బయట పెడతానని సవాల్ చేశారు. పోలీసుల తీరుపైనా దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.




మహాసముంద్: పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు అన్ని అధికారాలను ప్రజలు కాంగ్రెస్‌కు అప్పగించినప్పుడు ఆ పార్టీ ఏం చేసిందని ప్రధాని మోదీ ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దశాబ్దాలకుపైగా దేశాన్ని పాలించిన హస్తం పార్టీ ఓబీసీలకు రిజర్వేషన్లు ఎందుకు కల్పించలేదని అన్నారు. ఛత్తీస్‌గఢ్ రెండో విడత ఎన్నికల సందర్భంగా మహాసముంద్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. దేశాన్ని దోచుకొని సొంత ఖజానాలను నింపడమే కాంగ్రెస్‌కు తెలుసని విమర్శించారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ తనయుడు, సీఎం బంధువులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. స్థానిక ఉత్పత్తులు కొనుగోలు చేయాలంటూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పుడైనా ప్రజలను కోరిందా? అని మోదీ ప్రశ్నించారు. తొలివిడతలో జరిగిన 20 అసెంబ్లీ స్థానాల పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. కాంగ్రెస్ అబద్ధాల బుడగ పేలిపోయిందని అర్థమవుతోందని, ఇక మిగిలిన రెండో విడత పోలింగ్‌లోనూ ప్రజలు ఆ పార్టీకి గుణపాఠం చెప్పడం ఖాయమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా గత పదేళ్లలో దేశ వ్యాప్తంగా 4 కోట్ల పక్కా ఇళ్లను నిర్మిస్తే.. ఆ పథకాన్ని ఛత్తీస్‌గఢ్‌లో అమలు చేయకుండా ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. "దిల్లీ నుంచి వచ్చిన కాంగ్రెస్ మేధావులు కొందరు.. ప్రధాని మోదీ ఓబీసీ నుంచి వచ్చారని పదే పదే చెబుతున్నారు. ఆ రకంగా తాను ఓబీసీకి చెందిన వ్యక్తినని వాళ్లే ప్రజలకు గుర్తు చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. 2019 ఎన్నికల్లో ఈ పార్టీ నేతలే మోదీ పేరుతో పరోక్షంగా ఓబీసీలను దొంగలుగా అభివర్ణించారు. ఓబీసీలైన సాహు సామాజిక వర్గానికి చెందిన వారికి కాంగ్రెస్ ఎంత మేలు చేసిందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఆ పార్టీ తీరు ఏంటో ప్రజలందరికీ తెలుసు" అని మోదీ విమర్శించారు. దశాబ్దాలు గడిచినా ఓబీసీ కమిషన్‌కు కాంగ్రెస్ రాజ్యాంగ హోదా ఇవ్వలేదని, వైద్య కళాశాలల్లో ఓబీసీ కోటా అమలు చేయలేదని మోదీ విమర్శించారు. వీటన్నింటినీ అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వచ్చేది భాజపా ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన ఆయన.. అభివృద్ధి ఫలాలను అందుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాల్లో 20 చోట్ల నవంబర్ 7న పోలింగ్ ముగిసింది. మిగిలిన 70 నియోజకవర్గాలకు నవంబర్ 17న పోలింగ్ నిర్వహించనున్నారు.




మధిర : కల్యాణాల నిర్వహణకు ఎన్నికల కోడ్ ఓ పరీక్ష పెడుతోంది. కట్నకానుకాల మాట దేవుడెరుగు కనీసం పెట్టుబడి చీరలు కూడా ఒకేసారి తీసుకెళ్లడానికి జంకుతున్నారు. పెళ్లిళ్లకు నగలు, వస్త్రాలు భారీ ఎత్తున కొనుగోలు చేస్తుంటారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వాసులు ప్రధాన పట్టణాలతోపాటు సమీపంలోని పెద్ద నగరాలకు వెళుతుంటారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టడంతో కొనుగోలు చేసిన వాటికి తగిన ఆధారాలు చూపేందుకు అవస్థలే పడాల్సి వస్తోందని ఆయా కుటుంబాలవారు వాపోతున్నారు. మధిర పురపాలకంలోని ఉపాధ్యాయ కాలనీకి చెందిన ఓ ఇంట్లో ఈనెల వివాహం ఉంది. పెళ్లి దుస్తులు, నగలు కొనేందుకు విజయవాడకు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వచ్చిందని ఆ కుటుంబీకులు వాపోయారు. పెద్దపెద్ద దుకాణాల్లో నగదునే చెల్లించాల్సి వస్తుంది. దీంతో విజయవాడలోని బంధువుల నుంచి నగదు తీసుకుని కొనుగోలు చేసినట్లు తెలిపారు. నేలకొండపల్లిలోని ఓ కుటుంబ సభ్యుడి వివాహం ఖమ్మం కల్యాణమండపంలో పది రోజుల్లో జరుగనుంది. తమ బంధువులకు బహూకరించేందుకు వంద చీరలు వరకు కొనుగోలు చేసి స్వగ్రామంలోని ఇంట్లో ఉంచారు. ఇక్కడ నుంచి ఖమ్మం కల్యాణ మండపానికి చీరలు తీసుకెళ్లడం ప్రహసనంగా మారింది. బంధుమిత్రుల ద్వారా ద్విచక్రవాహనాలపై రోజూ కొన్ని తరలిస్తున్నామని సదరు వ్యక్తి తెలిపారు. మధిర మండలం సిరిపురం గ్రామంలో ఈనెల 20న వివాహం జరుగనుండగా ఆ ఇంటి వారు నగలు, వస్త్రాలు కొనుగోలు చేసేందుకు అవస్థలు పడ్డారు. నేరుగా నగదుతో వెళ్లే అవకాశం లేక స్నేహితుల వద్ద నుంచి క్రెడిట్, ఏటీఎం కార్డులు తీసుకుని వెళ్లామని వారు తెలిపారు.

**నవంబరులో భారీగా వివాహాలు** : ఈ నెల 16 నుంచి శుభముహూర్తాలుండటంతో ఉమ్మడి జిల్లాలో వందలాది వివాహాలు జరుగనున్నాయి. పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవడం తెలుగు సంప్రదాయం. ఇందుకోసం రూ.లక్షలకు లక్షలు ఖర్చు చేస్తుంటారు. ఒకరికంటే మరొకరు పోటీ పడుతూ హంగూఆర్భాటాలతో మూడు నుంచి ఐదు రోజుల పాటు వేడుకలను నిర్వహిస్తున్నారు. రిటర్న్ గిఫ్టల సంస్కృతి బాగా పెరిగింది. బంధుమిత్రులు భారీగా హాజరవుతుంటారు. వీటన్నింటిపైనా జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది.

**నగలు, దుస్తుల రవాణాకు తిప్పలు** : ప్రస్తుతం ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్ర, జిల్లా సరిహద్దుల వద్ద ప్రధాన రహదారుల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నగదు తరలింపు జరుగకుండా కట్టుదిట్టం చేస్తున్నారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితి నెలకొంటోంది. సాధారణంగా పెళ్లి దుస్తులు, నగలను హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం, కొత్తగూడెంలలో ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. వంటతయారు చేసేవారికి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. వంట తయారీకి అవసరమైన సరకులు రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు అవుతున్నాయి. కల్యాణమండపం, డెకరేషన్స్, ఈవెంట్ నిర్వాహకులకు డబ్బులు ఇచ్చేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. దూరప్రాంతాలకు వెళ్లి అవసరమైన వాటిని కొనేందుకు ఇక్కట్లు పడుతున్నారు. సరైన ఆధారాలు చూపకుంటే పట్టుబడిన నగదు వెంటనే చేతికి రావడంలేదు. శుభకార్యాలు చేసుకుంటున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది.

**ఆధారాలు చూపితే ఇబ్బందిలేదు-వసంత్‌కుమార్, మధిర సీఐ** – వివాహ వేడుకలకు సంబంధించి తగు ఆధారాలుంటే ఇబ్బందిలేదు. ఎక్కువ మొత్తం నగదు పట్టుబడితే వాటికి సరైన ఆధారాలు చూపి తిరిగి పొందవచ్చు. కొనుగోలు చేసిన వాటి రసీదులు చూపి, ఎందుకోసం కొన్నారనే అంశాలు వివరించాలి.




# దిల్లీవాసుల నిర్లక్ష్యం.. 'వర్షం ఊరట'ను తుడిచిపెట్టిన టపాసుల మోత

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ కాలుష్య కోరల నుంచి కాస్త బయటపడిందని ఊపిరిపీల్చుకునేలోపే.. దీపావళి తర్వాత పరిస్థితులు మళ్లీ ప్రమాదకరంగా మారాయి. సుప్రీంకోర్టు నిషేధాన్ని కూడా పక్కనబెట్టి దిల్లీ వాసులు టపాసుల మోత మోగించారు. దీంతో సోమవారం ఉదయం రాజధాని, దాని పరిసర ప్రాంతాలను కాలుష్య పొగ కమ్మేసింది. గత వారాంతంలో దిల్లీ లో మోస్తరు వర్షాలు కురవడంతో వాయు నాణ్యత సూచీ కాస్త మెరుగుపడింది. ఆదివారం సాయంత్రం వరకూ ఏక్యూఐ 218గానే నమోదైంది. కానీ, ఆ తర్వాత దీపావళి పండగను పురస్కరించుకుని దిల్లీ వాసులు బాణసంచా పేల్చారు. కాలుష్య పరిస్థితుల దృష్ట్యా దిల్లీలో టపాసుల వినియోగంపై సుప్రీంకోర్టు పూర్తి నిషేధం విధించినప్పటికీ.. చాలా చోట్ల అర్ధరాత్రి వరకు బాణసంచా మోత మోగింది. దీంతో సోమవారం ఉదయానికి దిల్లీలో గాలి నాణ్యత మళ్లీ క్షీణించింది. పలు ప్రాంతాల్లో విషపూరిత పొగ మంచు కమ్మేయడంతో వాహనదారులకు మళ్లీ ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ ఉదయం చాలా చోట్ల ఏక్యూఐ సూచీ 500 దాటగా.. లజ్‌పత్ నగర్‌లో వాయు నాణ్యత సూచీ ఏకంగా 959కి పడిపోయింది. జవహర్‌లాల్ నెహ్రూ నగర్‌లో 910, కరోల్ బాఘ్‌లో 779గా ఉంది. ఊపిరితిత్తులను పాడుచేసే అతిసూక్ష్మ ధూళికణాలుగా పేర్కొనే పీఎం2.5 కణాల సాంద్రత 24 గంటల్లోనే 140శాతం పెరిగింది. ఆదివారం ఉదయానికి ఈ సాంద్రత సగటున క్యూబిక్ మీటర్‌కు 83.5గా ఉండగా.. ఈ ఉదయానికి అది 200.8కి చేరిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు గణాంకాలు వెల్లడించాయి. దిల్లీ, నోయిడా, గురుగ్రామ్ తదితర ప్రాంతాల్లో ప్రజలు నిన్న రాత్రి విపరీతంగా బాణసంచా పేల్చడమే ఈ పరిస్థితికి కారణమైందని పలువురు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిషేధాన్ని అమలు చేయడంలో దిల్లీ అధికారులు విఫలమయ్యారని దుయ్యబడుతున్నారు.




# చంద్రమోహన్‌కు కన్నీటి వీడ్కోలు.. అంత్యక్రియలు పూర్తి!

ప్రముఖ నటుడు చంద్రమోహన్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం అపోలో ఆస్పత్రిలో మరణించిన సంగతి తెలిసిందే! సోమవారం ఆయన అంత్యక్రియలు పంజాగుట్టలోని శ్మశాన వాటికలో జరిగాయి. చంద్రమోహన్ సోదరుడు మల్లంపల్లి దుర్గాప్రసాద్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తొలుత ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. కుటుంబ సభ్యులు పలువురు సినీ ప్రముఖులు చంద్రమోహన్‌కు కడసారి వీడ్కోలు పలికారు. అభిమాన నటుడి కడసారి చూపు కోసం అభిమారులు భారీగా తరలివచ్చారు. అంతిమయాత్రకు ముందు పలువురు సినీ ప్రముఖులు చంద్రమోహన్‌కు నివాళులర్పించారు. వెంకటేశ్, రాజశేఖర్, జీవిత, నిర్మాత ఆదిశేషగిరిరావు, మాదాల రవి తదితరులు చంద్రమోహన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు.




ఇజ్రాయెల్-హమాస్ మధ్య భీకర పోరు జరుగుతోంది. దాంతో గాజా పౌరుల బతుకు ఛిద్రమవుతోంది. ఇదే సమయంలో అంతర్జాతీయంగా పలు దేశాలు కాల్పుల విరమణ కోసం డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బందీలను విడిపించుకునేందుకు ఇజ్రాయెల్ కాస్త పట్టు సడలిస్తోందా..? బందీల కోసం హమాస్‌తో ఒప్పందం దిశగా అడుగులు వేస్తోందా..? అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒప్పందం గురించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సూచనప్రాయంగా వెల్లడించడమే ఇందుకు కారణం. బెంజమిన్ యూఎస్ మీడియాతో మాట్లాడుతూ.. 'మేం ఆ ఒప్పందం చేసుకుంటాం.. ఈ ఒప్పందం చేసుకుంటామంటూ ఎన్నో ఊహాగానాలు వినిపించాయి. కానీ మేం గాజాలో భూతల దాడులు ప్రారంభించిన కొద్దిసేపటికే అంతా మారిపోయింది' అని వ్యాఖ్యానించారు. అయితే.. బందీలను విడిపించుకోవడానికి ఏదైనా ఒప్పందం జరిగే అవకాశం ఉంటుందా..? అని ప్రశ్నించగా.. 'ఉండొచ్చు' అని ప్రధాని బదులిచ్చారు. దాని గురించి వివరాలు వెల్లడించడానికి మాత్రం నిరాకరించారు. 'నేను దాని గురించి ఎంత తక్కువ మాట్లాడితే.. అది కార్యరూపం దాల్చడానికి అన్ని అవకాశాలు ఉంటాయి' అని తెలిపారు. అలాగే బందీలు విడుదల కాకుండా గాజాలో కాల్పుల విరమణ ఉండదని నెతన్యాహు స్పష్టం చేస్తున్నారు. హమాస్ చెరలో ఉన్నవారిని విడిపించేందుకు వీలైనన్నీ ప్రయత్నాలు చేస్తామని వెల్లడించారు. మరోవైపు.. బందీల విడుదల కోసం సంప్రదింపులు జరుగుతున్నాయని, వాటి గురించి బయటకు ఎంత తక్కువగా చెప్తే, అంత మంచిదని శ్వేతసౌధ ప్రతినిధి జాన్ కిర్బీ అన్నారు.

**అదుపులో హమాస్ ఉగ్రవాదులు.. ఇజ్రాయెల్‌కు తరలింపు:** ఉత్తర గాజాలో ఉన్న పలు ఆసుపత్రులను ఐడీఎఫ్ దళాలు చుట్టుముట్టాయి. వీటిలో గాజాలో అతిపెద్దదైన అల్-షిఫా, రెండో అతిపెద్దదైన అల్-ఖుద్స్ ఉన్నాయి. దీంతో ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు, మందుల సరఫరా కష్టతరం అవుతోంది. గాజా ప్రధాన ఆసుపత్రి అల్ షిఫా వద్ద భీకర పోరు జరుగుతోంది. మరోపక్క తాము 20 మంది హమాస్ ఉగ్రవాదుల్ని బంధించినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. దర్యాప్తు నిమిత్తం వారిని ఇజ్రాయెల్ తరలించినట్లు పేర్కొంది. భూతల దాడుల వల్ల తాము 44 మంది సైనికులను కోల్పోయినట్లు వెల్లడించింది.

# బైక్‌ను ఢీకొట్టి.. 20కి.మీ ఈడ్చుకెళ్లిన లారీ



కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని ఓ లారీ ఢీకొట్టింది. అనంతరం సుమారు 20కి.మీ వరకు బైక్‌ను ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో లారీ కింద ఇరుక్కున్న బైక్ తుక్కు తుక్కుగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కొంతమంది తమ ద్విచక్ర వాహనాలను కొయ్యలగూడెం వద్ద జాతీయ రహదారి పక్కన ఓ హోటల్ దగ్గర నిలిపారు. ఆ సమయంలో అటువైపు వేగంగా వచ్చిన లారీ.. ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ వాహన దారుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ క్రమంలో ఓ ద్విచక్ర వాహనాన్ని లారీ అలాగే ఈడ్చుకెళ్లింది. కొయ్యలగూడెం పోలీసులు ఇచ్చిన సమాచారంతో తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. కొయ్యలగూడెం నుంచి దాదాపు 20కి.మీ దూరంలోని దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద పోలీసులు లారీని అడ్డగించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వచ్చేది డైనోసార్ ధనుష్.. రిస్క్ వద్దు!

ఈ ఏడాది మిగిలిపోయిన మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో ప్రభాస్ సలార్ - షారుక్ డంకీ. డిసెంబర్ మూడో వారంలో ఇవి రిలీజ్‌కు రెడీగా ఉన్నాయి. సినీ ప్రియుల దృష్టంతా ఈ రెండు చిత్రాల మీదే ఉంది. దీంతో ఈ రెండు చిత్రాలకు అటు ఇటు కొద్ది రోజుల వరకు ఏ సినిమాలు వచ్చేందుకు సాహసం చేయవు! కానీ ధనుశ్? పాన్ ఇండియా మూవీ కెప్టెన్ మిల్లర్ మాత్రం విడుదల సాహసానికి సిద్ధంగా ఉంది. డిసెంబర్ 15న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



వాస్తవానికి ఈ చిత్రం విడుదల తేదీని ఎప్పుడో అనౌన్స్ చేశారు. అప్పటికీ షారుఖ్ ఖాన్ డంకీ మాత్రమే డిసెంబర్ రిలీజ్‌కు కన్ఫార్మ్ అయ్యింది. బాలీవుడ్ చిత్రం కావడంతో మిల్లర్ మేకర్స్.. పెద్ద పోటీగా భావించలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. అనూహ్యంగా సలార్ వచ్చి డిసెంబర్ మూడో వారానికి చేరింది. పైగా రీసెంట్‌గానే జవాన్‌తో మరో రూ.1000కోట్ల హిట్‌ను అందుకున్నారు షారుక్. అంటే ఇప్పుడు సలార్ - డంకీకి విపరీతమైన క్రేజ్ నెలకొని ఉంది. మరి ఇలాంటి సమయంలో కేవలం వారం రోజుల వ్యవధిలో ముందుగా వచ్చి.. మిల్లర్.. పైసా వసూలు చేయడం సాధ్యమేనా అంటే చెప్పడం కాస్త కష్టమే. గతంలో... 2018 డిసెంబర్‌లో ధనుశ్ 'మారి 2' రిలీజ్ చేసినప్పుడు.. అప్పుడు పోటీగా.. షారుక్ ఖాన్ జీరో, యష్ కేజీయఫ్ ఛాప్టర్ 1, మోహన్ లాల్ ఒడియన్, అక్వమెన్ వంటివి ఉన్నాయి. అయినా కూడా 'మారి 2' కమర్షియల్?గా మంచి సక్సెస్?ను అందుకుంది. ఇప్పుడు కూడా అలాంటి సీన్ రిపీట్? అవుతుందనే ధీమాతో సినిమా రిలీజ్? చేస్తే.. కష్టమే! ఎందుకంటే ఈ సారి పోటీగా వచ్చేది డైనోసార్. తక్కువ అంచనా వేయలం. కాబట్టి.. మిల్లర్ ఫైనల్ డెసిషన్? చాలా క్యాలికులేషన్లపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఢీ కొట్టేందుకు రెడీ అయిందా.. తమిళంలో ఓకే కానీ ఇతర భాషల్లో కష్టాలు తప్పవు. ఇకపోతే ఈ పీరియాడిక్ డ్రామాలో ప్రియాంకా మోహన్ హీరోయిన్, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే రిలీజైన టీజర్ ఆకట్టుకుంది.

## బికినీ హొయలతో కపూర్ బ్యూటీ కన్నుల విందు

ఆహా కళ్యాణం అంటూ 2014 లో తెలుగు ప్రేక్షకుల ముందుకు నానితో కలిసి వచ్చిన ముద్దుగుమ్మ వాణి కపూర్. ఆ సినిమా నిరాశ పరచడం తో సౌత్ లో మళ్లీ వాణి కపూర్ కనిపించలేదు. బాలీవుడ్ లో కూడా ఎంట్రీ ఇచ్చి పదేళ్లు అవుతున్నా కూడా నటించిన సినిమాలు చాలా తక్కువ. ఈ మధ్య కాలంలో కాస్త జోరు పెంచిన వాణి కపూర్ సోషల్ మీడియా సెన్సేషన్ గా నిలుస్తోంది. వెండి తెరపై కంటే కూడా సోషల్ మీడియా ద్వారా ఎక్కువగా కనిపిస్తూ సందడి చేస్తున్న ముద్దుగుమ్మ వాణి కపూర్. ఈ మధ్య హిందీ సినిమాల్లో జోరు కనబర్చుతున్న వాణి కపూర్ సోషల్ మీడియాలో అంతకు మించి



అన్నట్లుగా అందాల ఆరబోత చేస్తూ నెటిజన్స్ ని చూపు తిప్పుకోనివ్వడం లేదు అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఇటీవలే నెటిజన్స్ గొంతు తడి ఆరిపోయేంత అందంగా స్కిన్ షో చేసిన వాణి కపూర్ ఈసారి బికినీ షో తో పిచెక్కిస్తోంది. బికినీ వేసుకుంటే నార్మల్ గానే చూపు తిప్పుకోకుండా చూడాలని అనిపిస్తుంది. అలాంటిది బికినీ లో హొయలు పోతూ మతి పోగొట్టినంత పని చేస్తుందని నెటిజన్స్ చర్చించుకుంటున్నారు. ఈ రేంజ్ లో అందంగా ఉన్న వాణి కపూర్ ను బాలీవుడ్ కానీ.. ఇతర వుడ్స్ కానీ ఇన్నాళ్లు ఎందుకు పట్టించుకోలేదు పాపం అన్నట్టు ఆమె పై అభిమానం కనబరుస్తున్నారు. మొత్తానికి వాణి కపూర్ ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బికినీ ఫోటోలను మీరు ఒక లుక్కేయండి.




## మాజీ సీఎం భార్య ఈ రేంజ్ లోనా?



కర్ణాటక మాజీ సీఎం కుమార్ స్వామి భార్య రాధిక ఎంత ఫేమస్ తెలిసిందే. నటిగా కంటే రాధిక సీఎం భార్యగా దేశ వ్యాప్తంగా ఓ సంచలనం. ఇక రాధిక తెలుగు ప్రేక్షకులకు పెళ్లికి ముందే సుపరిచితం. తారకరత్న సరసన 'భద్రాది రాముడు' సినిమాలో నటించారు. ఆ తర్వాత ' అవతారం' అనే మరో సినిమాలోనూ కనిపించారు. అయితే రాధిక నటిగా ఇక్కడంత సక్సెస్ అవ్వలేదు. దీంతో కోలీవుడ్ లోనే కెరీర్ ని స్థిరం చేసుకున్నారు. ఆమె అక్కడే ఎక్కువ సినిమాలు చేసారు. ఇప్పటికీ యాక్టివ్ గా సినిమాలు చేస్తున్నారు. కుమార్ స్వామిని వివాహం చేసుకున్నా ఆమె కన్నడలో మాత్రం సినిమాలు ఆపలేదు. యధావిధిగా నటనారంగంలో రాణిస్తున్నారు. పెళ్లికి...వృత్తి పరమైన జీవితానికి ఏమాత్రం సంబంధం లేదని చాటి చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలో 'అజాగ్రత్త'..'భైరాదేవి' చిత్రాలు తెరకెక్కుతున్నాయి. ఇందులో ఆమె శక్తివంతమైన పాత్రలు పోషిస్తున్నారు. శశిధర్ దర్శకత్వం వహిస్తోన్న 'అజాగ్రత్త' సినిమాలో కొంత మంది బాలీవుడ్ నటీనటులు కూడా భాగమవు తున్నారు. సినిమాని ప్రతిష్టాత్మకంగా భావించి తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాన్ ఇండియా కి రీచ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక 'భైరాదేవి' చిత్రంలో రాధిక ఏకంగా అఘోర పాత్రలోనే నటిస్తున్నట్లు తెలుస్తోంది. కష్టాల్లో ఉన్న ప్రజల్ని కాపాడే రోల్ కావడంతో రాధిక ఈ పాత్రని సవాల్ గా భావించి చేస్తున్నారుట. అఘోర గెటప్ ఉన్న ఫోటోని ఆమె పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ చేసారు. అచ్చంగా అఘోరానే తలపిస్తుంది.

రాధిక అఘోర ఆహార్యం ఆకట్టుకుంటుంది. ఆమె పోషిస్తున్న ఈ పాత్ర నెట్టింట హాట్ టాపిక్ గానూ మారింది. కేవలం ఒకే జానర్ పాత్రలకే కాకుండా? వైవిధ్యమైన చిత్రాలతోనూ రాధిక మెప్పిస్తోన్న వైనం ప్రశంసనీయం. నటిగా తనకంటూ ఓ బ్రాండ్ ఐడెంటిటీ ఉండే కథలతో ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని స్వయంగా రాధికా కుమార్ స్వామి సొంత బ్యానర్లోనే నిర్మిస్తున్నారు.

## అందరూ ఆ డేట్ కోసమే ఎగబడితే ఎలా?




డిసెంబర్ నెలలో చాలా సినిమాలు ప్రేక్షకుల ముందుకి రావడానికి సిద్ధమవుతున్నాయి. మినిమమ్ రేంజ్ మూవీస్ నుంచి పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ వరకు థియేటర్స్ లోకి రాబోతున్నాయి. డిసెంబర్ 1న యానిమల్ సినిమాతో ఆ నెలలో సినిమాల తాకిడీ మొదలు కాబోతోంది. తరువాత ప్రతి వారం మూవీస్ రిలీజ్ అవుతూనే ఉండటం విశేషం. అయితే డిసెంబర్ 8 మాత్రం చాలా ప్రత్యేకం అని చెప్పాలి. డిసెంబర్ 22న డార్లింగ్ ప్రభాస్ సలార్ మూవీ రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాకి ఎదురెళ్ళడం కష్టం అని టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు నిర్మాతలందరికీ తెలుసు. దర్శకులు కూడా సలార్ కి పోటీగా తమ సినిమాలు రిలీజ్ చేసే ధైర్యం చేయలేరు. అంతగా సలార్ మూవీ ఇంపాక్ట్ ఉంటుంది. ఆ ముందు వారం సినిమాలు రిలీజ్ చేసిన కచ్చితంగా మొదటి వారం తర్వాత సూపర్ హిట్ టాక్ వచ్చిన కలెక్షన్స్ కచ్చితంగా డ్రాప్ అయిపోతాయి. అందుకే సేఫ్ జోన్ గా డిసెంబర్ 8న రిలీజ్ ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే ఈ డేట్ కోసం ఇప్పుడు కాంపిటేషన్ ఎక్కువైపోయింది. వరుణ్ తేజ్ తెలుగు, హిందీ భాషలలో చేస్తోన్న ఆపరేషన్ వాలంటైన్ మూవీ డిసెంబర్ 8న రిలీజ్ కానుంది. విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి కూడా అదే రోజు థియేటర్స్ లోకి రాబోతోంది. బాలీవుడ్ లో కరణ్ జోహార్ నిర్మాణంలో సిద్ధార్ధ్ మల్హోత్రా చేస్తోన్న పాన్ ఇండియా మూవీ యోదాని డిసెంబర్ 15న రిలీజ్ చేద్దామని అనుకున్న ఒక వారం ముందుకి తీసుకొస్తున్నారు. విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ లీడ్ రోల్ లో శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కిస్తున్న మేరీ క్రిస్మస్ మూవీని కూడా డిసెంబర్ 8కి రిలీజ్ చేయాలని భావిస్తున్నారు. వీటితో పాటుగా నేచురల్ స్టార్ నాని హాయ్ నాన్న మూవీని కూడా డిసెంబర్ 7, 8 తేదీలలో ఏదో ఒక రోజు కన్ఫర్మ్ చేయాలని అనుకుంటున్నారు. మొత్తానికి డిసెంబర్ 8కి అయితే సినిమాల మధ్య పోటీ గట్టిగానే ఉండబోతోంది. పాన్ ఇండియా కల్చర్ పెరిగిన తర్వాత అన్ని భాషల నుంచి సినిమాలు డబ్బింగ్ రూపంలో ఇతర భాషలలో కూడా రిలీజ్ అవుతున్నాయి. ఇది కూడా సినిమాల రిలీజ్ విషయంలో కాంపిటేషన్ పెరగడానికి ఒక కారణం అయ్యిందని చెప్పొచ్చు.

## 'యానిమల్'క్రేజ్ తో రష్మిక పెంచేసిందా?

నేషనల్ క్రష్ బ్యూటీ రష్మిక మందన్న క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందులోనూ సోషల్ మీడియా లో భారీ ఫాలోయింగ్ ఉన్న నటి. తనదైన శైలి చమత్కారలతో జనాల్ని ఆకర్షించడంలో అమ్మడి దగ్గర ఉన్న టెక్నిక్ లే మరే నటి దగ్గరా లేవంటే? అతిశయోక్తి కాదు. వెండి తెర గొప్ప పెర్ఫార్మర్ మాత్రమే కాదు అంతకు మంచి తనదైన శైలిలో ఎదుట వారిని ఆకర్షించుకోవడంలో తనదమైన ముద్ర కనిపిస్తుంది. అందుకే సోషల్ మీడియాలో అంత ఫాలోయింగ్ ఉన్న నటి అయింది. ఇక కెరీర్ పరంగా టాలీవుడ్ టూ బాలీవుడ్ దూసుకుపోతుంది. పుష్ప తో పాన్ ఇండియా క్రేజ్ ని ఆస్వాదిస్తోంది. యానిమల్ కూడా హిట్ అయితే అమ్మడి రేంజ్ టచ్ చేయని స్థాయికి రీచ్ అవుతుందని




అంచనాలున్నాయి. మరి ఈ బ్యూటీ ఒక్కో సినిమాకి ఎంత ఛార్జ్ చేస్తుంది? అంటే ఇంతవరకూ మూడు కోట్లు అని వినిపించింది. తాజాగా అమ్మడు మరో కోటి పెంచి నాలుగు కోట్లు పారితోషికంగా తీసుకుంటుందన్న విషయం లీకైంది. ఈ కోటి పెపకం అన్నది ఈ మద్యనే జరిగినట్లు తెలుస్తోంది. పుష్ప రిలీజ్ అనంతరం రష్మిక హైక్ చేస్తుందని ప్రచారం సాగిందిగానీ..అందులో క్లారిటీ లేదు. అయితే తాజాగా ఆమె అమ్మడి డైరీలో కొత్త రూల్స్ రాసిపెట్టికుందిట. దీనిలో భాగంగానే పారితోషికంలోనూ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. యానిమల్ రిలీజ్ అయి హిట్ అయితే ఆ నెంబర్ కూడా పెంచే అవకాశం ఉందిట. లేదంటే యధావిధిగా నాలుగు కోట్లు తీసుకుంటుంది. ఇక్కడ కోటి పెంచడానికి ఓ కారణం ఉంది. యానిమల్ రిలీజ్ కి ముందే ఇలా చేస్తే! ఈ గ్యాప్ లో కొన్ని ప్రాజెక్ట్ లు లాక్ చేయోచ్చు. వాటి ద్వారా తాను కోట్ చేసిన మొత్తం వస్తుంది. ఒకవేళ సినిమా అటు ఇటూ అయితే బ్యాలెన్స్ గా వెళ్లొచ్చు ! అన్నది అమ్మడి ప్లాన్ గా తెలుస్తోంది. ఇక ఎండార్స్ మెంట్స్ విషయంలో రష్మిక చాలా కాలంగా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తన దగ్గరకువచ్చిన ఏ బ్రాండింగ్ ని విడిచిపెట్టదు. వాటి ద్వారా ఎంతో కొంత ఆదాయం సమకూరుతుందని కమిట్ అవుతుది. ఆ లెక్కన చూస్తే రష్మిక మందన్న నికర విలువ 45 కోట్లు. నివేదికలప్రకారం ఎనిమిది కోట్లు వార్షిక ఆదాయంతో నెలకు 60 లక్షల వరకూ సంపాదిస్తోందని తెలుస్తోంది.

## 'దంగల్' బ్యూటీ ఇన్ స్టాలో దరువేస్తోందిగా!

బాలీవుడ్ యంగ్ బ్యూటీ సన్యా మల్హోత్రా ఇన్ స్టా క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు ఎప్పటికప్పుడు హీటెక్కించే ఫోటోలతో నెట్టింట హాట్ టాపిక్ గా మారుతుంది. డిజైనర్ దుస్తుల్లో సొగసరి తనని తాను చక్కగా ఫోకస్ చేసుకుంటుంది. నిత్యం ఏదో రీల్ తో ఇన్ స్టాలో హల్చల్ చేస్తూనే ఉంటుంది. తాజాగా బ్యూటీ మరో రీల్ తో ముందుకొచ్చేసింది. మిరుమిట్లు గొలిపే డిజైనర్ దుస్తుల్లో ఓ హిందీ పాటకి డాన్సు చేసింది. బ్యూటీ ఎలివేషన్ల సంగతి పక్కనబెడితే డిజైనర్ డ్రెస్ లో మాత్రం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. మిరుమిట్లు గొలిపే డిజైన్ సన్యా స్కిన్ టోన్ ని మరింత ప్రకాశవంతం చేస్తుంది. అమ్మడి మ్యాకప్ ..యాక్సరసీస్ సన్యాని మరింత అందంగా ఎలివేట్



చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అమ్మడి అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. ఇక బ్యూటీ కెరీర్ సంగతి చూస్తే దేదీప్య మానంగా సాగిపోతుంది. 'దంగల్' సక్సెస్ తో వరుస అవకాశాలతో బిజీ అయింది. ఇంతకాలం ఏడాదికి ఒక సినిమా చేసిన బ్యూటీ 2023 లో మరింత స్పీడప్ అయింది. ఇటీవలే 'జవాన్' తో భారీ విజయం ఖాతాలో వేసుకుంది. దీంతో 1000 కోట్లు వసూళ్లు దాటిన సినిమా మరోకటి సన్యా ఖాతాలో పడింది. దంగల్..తర్వాత జవాన్ తోనే ఆ ఫీట్ సాధించింది. ప్రస్తుతం 'సామ్ బహదూర్' ..'ది గ్రేట్ ఇండియన్ కిచెన్' రిమేక్ లోనూ నటిస్తోంది. అమ్మడు ఈ రెండు సినిమాలపై చాలా ఆశలు పెట్టుకుంది. రెండు డిఫరెంట్ చిత్రాలు. వాటిలో సన్యా పాత్ర వైవిధ్యంగా ఉంటుందని యూనిట్ అంటోంది. ఇప్పటికే ఈ రెండు సినిమాల షూటింగ్ కూడా పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.




## సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం: కేసీఆర్

దమ్మపేట: రైతులు, పరిశ్రమలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా నీళ్లిచ్చామని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. ఎన్నికలు వస్తూపోతుంటాయని.. ప్రజలు మాత్రం ఆగం కాకుండా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. "ప్రజలు అభ్యర్థుల మంచి, చెడుతో పాటు గుణం గురించి ఆలోచించాలి. అభ్యర్థుల వెనక ఉన్న పార్టీల చరిత్ర.. వాటి నడవడిక, అధికారమిస్తే ఏం చేస్తారు? పేదలు, రైతుల పట్ల ఆ పార్టీల వైఖరి ఎలా ఉంటుందనే దానిపై చర్చ జరగాలి. అలా జరిగితే నాయకుడు గెలవడం కంటే ప్రజలు గెలవడం ప్రారంభమవుతుంది. దాని ద్వారా మంచి జరిగే అవకాశముంటుంది. తెలంగాణలో మూడో సారి జరుగుతున్న ఎన్నికలివి. ప్రత్యేక రాష్ట్రం సాధించుకునేందుకు ఎన్ని ఇబ్బందులు పడ్డామో అందరికీ తెలుసు. తెలంగాణను బలవంతంగా తీసుకెళ్లి ఆంధ్రలో కలిపారు. ఉన్న తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రలో కలిపింది కాంగ్రెస్సే. అప్పుడు ఉద్యమాలను అణచివేసింది ఎవరు? 2004లో రావాల్సిన తెలంగాణ ఆలస్యంగా వచ్చింది. తెలంగాణలో జరిగిన తొలి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి భారాస వచ్చినపుడు కరెంటు సమస్య ఉంది. నేడు దాన్ని పరిష్కరించుకున్నాం. కులం, మతం బేధాలు లేకుండా అందర్నీ సమానంగా చూస్తూ ముందుకెళున్నాం. అందుకే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతోంది. గోదావరిపై సీతారామ ప్రాజెక్టు కట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నీళ్లివ్వొచ్చని ఏ కాంగ్రెస్ నేతా గతంలో ఆలోచన చేయలేదు. భారాస ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దాని నిర్మాణం ఇప్పటికే 70 శాతం పూర్తయింది. ఆ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుంది. ధరణి పోర్టల్‌తో గోల్‌మాల్‌కు ఆస్కారం లేదు. రైతుల పట్ల సానుభూతి లేని కాంగ్రెస్ నేతలు ధరణిని తీసేస్తామంటున్నారు. అదే జరిగితే రైతులకు రైతుబంధు సహా ఇతర పరిహారాలు ఎలా అందుతాయో చెప్పాలంటే కాంగ్రెస్ నేతల నుంచి సమాధానం లేదు. అందుకే ఏ పార్టీ వైఖరేంటి? వాళ్ల ఆలోచనా సరళి ఏంటి?అనేది చూడాలి" అని కేసీఆర్ కోరారు.



## మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా.. నాంపల్లి అగ్నిప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశం

నాంపల్లి అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పూర్తిస్థాయి దర్యాపునకు ఆదేశించారు. నాంపల్లిలోని ఓ భవనంలో అగ్నిప్రమాదం జరిగి తొమ్మిది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి కేటీఆర్ అగ్ని ప్రమాదం జరిగిన సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఘటనపై మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులు, స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతులకు సంతాపం తెలిపి.. బాధిత కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అస్వస్థతకు గురైన వారికి ఉస్మానియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తామన్నారు. ప్రమాదంలో ఆస్తి నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆరు నెలల కింద అగ్ని ప్రమాదాలపై సేఫ్టీ ఆడిట్ కింద ఎంక్వైరీ చేయించామని.. ఇప్పుడేం జరిగిందో నివేదిక ద్వారా తెలుసుకుంటామన్నారు. ఇవాళ ఉదయం 9.30 గంటల ప్రాంతంలో నాంపల్లి బజార్‌ఘాట్ ఏరియాలోని ఓ భవనంలోని గ్యారేజీలో రిపేరు చేస్తున్న సమయంలో మంటలు చెలరేగాయి. గ్యారేజీ సమీపంలో రసాయనాల డ్రమ్ములకు మంటలు అంటుకొని భవనంపై వరకు విస్తరించాయి. ఈ ఘటనలో ఇప్పటి వరకు తొమ్మిది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరికి గాయాలవగా.. పలువురు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం సంఘటనా స్థలంలో ఎన్డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

## నాంపల్లి అగ్నిప్రమాదంపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి



హైదరాబాద్: నాంపల్లి భారీ అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. తక్షణమే పటిష్టమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశాలు జారీ చేశారు. తీవ్రంగా గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. కాగా.. నాంపల్లి బజార్‌ఘాట్‌లోని నాలుగు అంతస్థుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో డీజిల్ డ్రమ్ముల్లో చెలరేగిన మంటలతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు మృతి చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. కొందరు సజీవదహనం అవగా... మరికొందరు ఊపిరాడక మృతి చెందారు. కారు రిపేర్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గాయపడిన వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మూడు ఫైరింజన్లతో మంటలను అదుపుచేసేందుకు యత్నిస్తున్నారు.

## రెసిడెన్షియల్ ఏరియాలో కెమికల్ డ్రమ్ములు ఎలా నిలువ చేశారు?

హైదరాబాద్ : నాంపల్లి బజార్ ఘాట్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ అగ్ని ప్రమాదాలకు నిలయంగా మారిపోయిందన్నారు. వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ రోజు ఒక అపార్ట్‌మెంటులో జరిగిన అగ్ని ప్రమాదంలో 9 మంది మృతి చెందడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. అపార్ట్‌మెంటు సెల్లార్‌లో కారు మరమ్మతులు ఏంటని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్ ఏరియాలో కెమికల్ డ్రమ్ములు ఎలా నిలువ చేశారని ప్రశ్నించారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మృతులకు ప్రగాఢ సంతాపం. వారి కుటుంబ సభ్యులకు



ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రేవంత్ కోరారు.

## మంత్రి జగదీష్ రెడ్డి వచ్చాకే చేతినిండా పని, పొట్ట నిండా తిండి..మంత్రికి మద్దతు ప్రకటించిన హమాలీ సంఘాలు

సూర్యాపేట : సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డికి మద్దతుగా కార్మిక సంఘాలు ఏకమవుతున్నాయి. తాజాగా సూర్యాపేట మున్సిపాలిటీ లోని దిగుమతి హమాలీ సంఘానికి చెందిన 500 కుటుంబాలు ఏకగ్రీవంగా తమ మద్దతును ప్రకటించారు. 2014 కు ముందు సరైన ఉపాధి లేక పస్తులు ఉన్న తమకు జగదీష్ రెడ్డి వచ్చాకే, చేతినిండా పని, పొట్ట నిండా తిండి దొరుకుతుందని హమాలీ సంఘం నేత రాజు, సైదులు, భూపాల్ తెలిపారు. మంత్రి జగదీష్ రెడ్డి సూర్యాపేటలో వేలకోట్లతో చేస్తున్న అభివృద్ధి, అదుపులో ఉంచిన శాంతి భద్రతల కారణంగా, వెల్లువలా వచ్చిన వ్యాపార సంస్థలతో తమకు చేతినిండా ఉపాధి లభిస్తుందని అన్నారు. సమాజంలో గౌరవంగా బతుకుతున్నామని తెలిపారు. తమ బతుకులను బాగు చేసిన జగదీష్ రెడ్డి కే మారోసారి మా మద్దతు అన్నారు. మంత్రి గెలుపు కోసం ఇంటికొకరం చొప్పున స్వచ్ఛందంగా ప్రచారం నిర్వహించి, మంత్రి హ్యాట్రిక్ విజయంలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. మంత్రి జగదీష్ రెడ్డిని తమ భవనానికి ఆహ్వానించిన హమాలీలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ నాకు మద్దతు తెలిపిన హమాలీ సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి, భవిష్యత్తు లో హమాలీ సంఘం భవన విస్తరణకు, కార్మిక చట్టాల ప్రకారం ప్రభుత్వం తరపున వారికి వర్తించే అన్ని సదుపాయాలు కూడా వర్తింప చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, బీఆర్టీయూ జిల్లా నాయకులు గురూజీ, కార్మిక సంఘం నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు సవరల సత్యనారాయణ, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు తదితరులు పాల్గొన్నారు.




## నిజామాబాద్‌లో బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ..

నిజామాబాద్ : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో సవాళ్ల యుద్ధం జరుగుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థి గణేష్ గుప్తా, బీజేపీ అభ్యర్థి సూర్యనారాయణ గుప్త మధ్య సవాళ్లు హెూరెత్తుతున్నాయి. నగర అభివృద్ధిపై చర్చకు సిద్ధమని గణేష్ గుప్తా సవాల్ విసిరారు. సవాల్‌ను స్వీకరించి కంటేశ్వర్ టెంపుల్ వద్ద చర్చకు రావాలని సూర్యనారాయణ గుప్త తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సూర్యనారాయణ గుప్త ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసులు మోహరించారు. సూర్యనారాయణ ఇంటికి నోటీసులు అంటించారు. సవాళ్లు ప్రతి సవాళ్లతో అర్బన్‌లో రాజకీయ వేడి పెరిగిపోతోంది.

## డిసెంబర్ 3న తెలంగాణ గులాబీమయం కాబోతున్నది : కేటీఆర్



హైదరాబాద్ : డిసెంబర్ 3న యావత్ తెలంగాణ గులాబీమయం కాబోతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ప్రగతిభవన్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ వెలువరించిన 'కాంగ్రెస్ చేసిందేంది' అనే సంకలనాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణలో ముచ్చటగా మూడోసారి గులాజీ జెండా ఎగురబోతున్నదన్నారు. ప్రజలు ఎంత స్థితప్రజ్ఞత కలవారో గతంలో రెండు ఎన్నికల్లో రుజువైందని, కొనసాగుతున్న అభివృద్ధిని మరింత ముందుకుసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే సాధ్యమని ప్రజలకు బాగా తెలుసునన్నారు. కాంగ్రెస్ ఏం చేసిందో.. ఏం చేయగలదో అంతా ప్రజలకు తెలుసునని చెప్పారు. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టడం కాంగ్రెస్ వల్ల కాదని.. డిసెంబర్ 3న తెలంగాణ అంతా గులాబీమయం కాబోతున్నదని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ అంతే తెలంగాణ స్వీయ అస్తిత్వానికి ఆత్మలాంటిదని.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న కేసీఆర్‌ను ప్రజలు గెలిపించుకుంటారన్నారు. తెలంగాణను ధ్వంసం చేసిందెవరో.. తెలంగాణను పునర్నిర్మిస్తున్నదెవరో తెలంగాణ మట్టికి తెలుసునన్నారు. ఎవరెన్ని టక్కుటమార గజకర్ణ గోకర్ణ విద్యలు ప్రదర్శించినా.. గోల్‌మాల్ కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరన్నారు. తెలంగాణ కన్నీళ్లను తుడిచి బీడు భూములపై గంగమ్మను ప్రవహింపజేస్తున్న కేసీఆర్‌ను తెలంగాణ గుండెల్లో దాచుకుంటుందన్నారు. తెలంగాణను నిస్తేజంగా మార్చిన కాంగ్రెస్ అసలు రంగు ప్రజలకు తెలుసునన్న కేటీఆర్.. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా 30న బ్యాలెట్ బాక్సుల్లో బీఆర్ఎస్ విజయం పదిలమన్నారు. తెలంగాణను చీకట్లో ముంచిన కాంగ్రెస్‌ను ప్రజలు తిప్పికొడతారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎండిన భూములు, రాష్ట్రం నుంచి సంఖ్యల్లో వలసలు కొనసాగాయని.. బీఆర్ఎస్ పాలనలో పసిడి పంటల తెలంగాణ వర్ధిల్లుతోందని చెప్పారు. కాంగ్రెస్ ఏలుబడిలో తెలంగాణ మొత్తం సంక్షోభమేనని.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ పునర్నిర్మించబడుతూ దేశానికే మోడల్‌గా మారిందని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వ్యవహారాన్ని కళ్లకు కట్టినట్లుగా పుస్తకాన్ని వెలువరించిన జూలూరి గౌరీశంకర్‌ను కేటీఆర్ అభినందించారు.

## మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్ గౌడ్




యాదాద్రి భువనగిరి : బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉన్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి వెల్లువలా వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్ గౌడ్, యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ పల్లెపాటి సత్యనారాయణ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ ఒంటెద్దు పోకడ వల్లే ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్లుగా శాంతియుత పోరాటం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా శాంతియుత పోరాటం జరుగుతోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై గత ప్రభుత్వాలు ఎన్నో కమిటీలు వేశాయన్నారు. ఏ ప్రధాని కూడా ఎస్సీ వర్గీకరణపై సీరియస్‌గా చర్చించలేదని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై అన్నీ పార్టీలు కంటితుడుపు చర్యగా ప్రవర్తించాయని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ ఆలస్యంలో మొదటి ముద్దాయి కాంగ్రెస్ పార్టీనే అని.. యూపీఏ ప్రభుత్వం తుషార్ మెహతా కమిటీ వేసి వదిలేసిందని చెప్పారు. ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ కమిటీ నివేదికను కూడా చదవలేదన్నారు. మందకృష్ణ మాదిగ జులైలో ప్రధాని మోదీని కలిసి దీనిపై విన్నవించగా.. ఆగస్టులో ఎమ్మార్పీఎస్ నాయకులను అమిత్‌షా దిల్లీకి పిలిపించుకొని మాట్లాడారని చెప్పారు. "ఎస్సీ వర్గీకరణపై గతంలో సుప్రీంకోర్టు రెండు రకాలు తీర్పులు ఇచ్చింది. ఐదుగురు సభ్యుల ధర్మాసనాలు పరస్పర విరుద్ధ తీర్పులు ఇచ్చాయి. ఒక ధర్మాసనం వర్గీకరణ జరగాలని, మరొక ధర్మాసనం వద్దని తీర్పు ఇచ్చింది. చివరగా ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని సూచించింది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ఐటీదాడుల కలకలం.. ఫార్మా కంపెనీల్లో తనిఖీలు..!

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ ఐటీ దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. ఇటీవల పలువురు నాయకుల ఇళ్లల్లో సోదాలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం నుంచి నగంలోని పలుచోట్ల దాడులు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. దాదాపు 15 చోట్ల ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఇందులో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బంధువుల ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. అయితే, ఐటీ అధికారులు ఈ సారి ఎక్కువగా ఫార్మా కంపెనీలే లక్ష్యంగా దాడులు జరుపుతున్నట్లు సమాచారం. ఆర్‌సీపురంలోని నాగులపల్లి, అమీన్‌పూర్‌లోని పటేల్‌గూడలో సోదాలు చేస్తున్నారు. అలాగే గచ్చిబౌలిలోని హైహెూం భుజాలో తనిఖీలు సాగుతున్నాయి. ఫార్మా కంపెనీ డైరెక్టర్లు, బ్యాంకు వివరాలు, ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జానారెడ్డి, పారిజాత నరసింహారెడ్డి, కేఎల్‌ఆర్ నివాసాలపై దాడులు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి బంధువుల ఇండ్లలోనూ తనిఖీలు జరుగడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com